# ఆ రాత్రి

ఆ రాత్రికే శోభనం వాసుదేవరావుకి!

క్రితం రాత్రి తెల్లవారు ఝాము లగ్నంలో పెళ్ళయింది — సుజాతకీ, వాసుదేవరావుకీ. అచ్చట్లూ ముచ్చట్లూ అన్నీ అయ్యేసరికి భళ్ళున తెల్లారింది. కాఫీలయ్యాక ఫ్రెండ్సూ, కొంతమంది చుట్టాలూ వెళ్ళి పోయారు. ఇల్లు ఇంకా సందడిగానే వుంది. పెళ్ళి కొడుక్కీ, అతని తరుపు వాళ్ళకీ దక్షిణంవేపు రెండు గదులిచ్చారు విడిగా. పెళ్ళికొడుకు తల్లి కూడా మధ్యాన్నం బండికి వెళ్ళిపోయింది. వదినా, అక్కా, వధూవరుల్ని తీసికెళ్ళాలని వాసుతోపాటు వుండి పోయారు.

మధ్యాన్నం పడుకున్న వాడు చీకటి చీకటి పడి పక్షులరుస్తోంటే లేచాడు తుళ్ళిపడుతూ. రాత్రవుతోందో తెల్లవారుతోందో అర్థంకాలేదు కాస్సేపు.

పద్మ వచ్చింది లోపలికి, "లేచావా?" అంటూ.

పెళ్ళికూతురు పినతండ్రి కొడుకు — పధ్నాలు గేళ్ళ రామారావు "బావగారు లేచారాండీ?" అంటూ వచ్చాడు.

తినడానికి ఏవో పెట్టారు. కొంచెం తిన్నాడు.

"కాస్సేపలా తిరిగొద్దాం" అన్నాడు వాసు, ఆ పిల్లాడితో.

బావమరుదులిద్దరూ బజార్లోకి బయల్దేరారు.

నడుస్తున్నాడేగానీ వాసు మనసు అవ్యక్తమైన ఆలోచనలతో నిండిపోయింది పెళ్ళి .... అయి పోయింది రాత్రి! ఈ రాత్రి....!

మాటిమాటికీ వాసు మొహం నిండా నవ్వు మెరుస్తోంది.

బావమరిది బజార్లన్నీ చూపిస్తున్నాడు. ఊరు గురించి తెగ వర్ణిస్తున్నాడు. వాసు ఒక్కటీ వినటం లేదు. "ఊఁ" కొడుతున్నాడు పరధ్యాన్నంగా.

ఎక్కడా ఆగనివాడు పూల దుకాణం ముందు నిలబడిపోయాడు.

"ఎందుకండీ? పూలు కొందామా?" అన్నాడు రామారావు.

"అబ్బే! ఊరికే చూశాను. పూలెందుకూ?" అంటూ ముందడుగు వేశాడు. నిజంగా వాసుకి, మల్లె పువ్వులూ గులాబీ పువ్వులూ చెరో గంపా కొనేసి.... రిక్షాలో వేయించుకుని తీసికెళ్దామనిపించింది. కానీ .... మొదటి రోజు తను పూలు తీసికెళ్తే ఏం బాగుం టుంది? పెళ్ళింట్లో వాళ్ళంతా నవ్వుకుంటారు. రేప ట్నించీ ఎన్ని రాత్రులు లేవు! ఎన్ని రోజులు లేవు. ఎన్ని గంపల పూలైనా కొనుక్కోవచ్చు. కానీ, వాసు ఇంకో చోట సంపెంగలు కనపడగానే అంత నిగ్రహంగా వుండలేకపోయాడు. ఒక డజను సంపెంగ పువ్వులు కొన్నాడు. ఆ పొట్లం జేబులో పెట్టుకున్నాడు. తనకు సంపెంగలు ఇష్టమని సుజాతకి చెప్పాలి. ఉలిక్కి పడ్డట్టు వాచ్ చూశాడు — ఎనిమిదిన్నర.

"తొమ్మిదై పోతోందోయ్, వెళ్దాం పద" అంటూ నడకలో వేగం పెంచాడు.

రాగానే స్నానం అయింది. ఆకలి లేదని ఎంత చెప్పినా ఎవ్వరూ వినలేదు. తెగ విసిగించారు. పాలన్నం తినటానికి ఒప్పుకున్నాడు. పాలల్లో పంచదార వేసుకుని పరమాన్నం తిన్నట్టు తిన్నాడు.

జానకీ, పద్మా వాసుని వదిలేసి పెళ్ళికూతురు దగ్గిరికి వెళ్ళిపోయారు.

సాయంత్రం నుంచీ బలవంతంగా ఆపివుంచు కున్న ఊహలు పూల పరిమళంలా మనసంతా ఆవ రించుకున్నాయి. సుజాతతో మాట్లాడాలి. సుజాతని ముద్దు పెట్టుకోవాలి! వక్కపొడిలో దొరికే తియ్యటి పలుకులు ఏరుకుతింటూ ఒక్కడూ వరండాలో కూర్చున్నాడు.

ఈపాటికి గది సర్దటం అయివుంటుంది. మంచా నికి మల్లెపువ్వుల దండలూ, గదినిండా అగరొత్తుల సువాసనలూ... ఏమో! ఇంకేమిటో! చూడాలి మరి. వదిన ఎలా అలంకరిస్తోందో!

పెళ్ళి ముహూర్తం పెట్టుకున్న దగ్గిర్నించీ జానకి, మరిదితో ఎన్నోసార్లు హాస్యమాడింది — "ఇదిగో, టైలర్ దగ్గిరికి వెళ్ళి జాకెట్లు తెచ్చిపెట్టమంటే వినలేదు

కదూ? సరేలే, జ్ఞాపకం వుంచుకో."

"ఏం, ఏం చేస్తావు?"

"నా అవసరం వచ్చినప్పుడు చెప్తా."

"నీ అవసరం నా కెందుకొస్తుంది?"

"అదే చూద్దాం. రేపు అబ్బాయి గారికి పెళ్ళప్పుడు నేను పట్టించుకోకపోతే ఏదీ అవదు. మీ ఆవిణ్ణి ఎవరు ముస్తాబు చేస్తారో చూద్దాం!"

వాసు నవ్వుకున్నాడు. వదిన చేసేదంతా ఇవ్వాళ కనపడాలి మరి. సుజాతని ఎంత బ్రహ్మాండంగా ముస్తాబు చేసేస్తోందో చూస్తాడుగా?

సుజాత పూలజడ కుట్టించుకుంటూ వుంటుం దేమో .... ఇప్పుడు! మెడ నొప్పిపెట్టి తనని తిట్టు కుంటోందేమో! నిజంగా అలాగే అయితే గడ్డం పట్టు కుని బతిమాలుకుంటాడు "ఇదో సరదా కదా సుజీ! పూలజడలు రోజూ వేసుకోరుగా? పోనీ ఇంకెప్పుడూ వేసుకోవద్దులే" అని చెప్పాలి.

అయినా సుజాత అంత మనసులేని మనిషేం కాదు. రాత్రి పెళ్ళిలో నవ్వుతూ.... తన కళ్ళకి దొరక కుండా తప్పించుకుంటూ .... తనకి తెలీదా? గదిలో అడుగు పెట్టగానే గదికి నాలుగువేపులా ఎక్కడెక్కడ గుమ్మాలున్నాయో కిటికీలున్నాయో చూడాలి. ఎవరు నవ్వుకున్నా సరే, వరసగా అన్నీ మూసెయ్యాలి. ముందు సుజీ మాట్లాడుతుందో లేదో చూడాలి. పాపం సిగ్గుకదా? మరి తనకి మాత్రం సిగ్గుకాదా? ముందు తనే మాట్లాడాలా?

సిగ్గుతో వాసు ఒళ్ళు పులకరించింది.

అసలు పెళ్ళి అన్న దగ్గిర్నుంచీ సుజాతతో ఏకాం తంగా మాట్లాడడం గురించే కలలు కంటున్నాడు వాసు. పెళ్ళి పదిమంది మధ్యా ఎలాగో అయి పోతుంది. పంతుళ్ళేం చెప్తే అదే చెయ్యాలి. ఆడ వాళ్ళంతా గుమిగూడుతారు. ఊపిరి సలపనివ్వరు. మనసు ఆగక పెళ్ళికూతుర్ని చూస్తే వదినలాంటి వాళ్ళు పట్టేసి వేళాకోళాలతో కాల్చుకుతింటారు. సుజాతని చూడడానికి కూడా స్వేచ్ఛ ఉండదు. కానీ ఈ రాత్రి అలాక్కాదు. కావలసినంత ఏకాంతం! సుజా ఒక్కతే వుంటుంది. ఎవరో చూస్తారనీ ... నవ్వుతారనీ జంకు వుండదు. ఇద్దరూ .... ఎంతో దగ్గరగా కూర్చుని .... తనివితీరా చూసుకుంటూ .... ఒకరి చేతులు ఒకరు పట్టుకుని మాట్లాడుకోవచ్చు. ...... ఆ మధురక్షణాలు వచ్చేస్తున్నాయి!

"వాసూ! ఇక్కడున్నావా?"అంటూ పద్మ వచ్చింది.

తుళ్ళిపడి తలఎత్తాడు వాసు. టైం చూశాడు. పదిన్నర — అబ్బా!

"అదేమిటి, కుర్చీలో నిద్ర? పడుకుంటే మంచం మీద పడుకో."

"ఊహూఁ! ఊరికే అలా కూర్చున్నా!"

"ఎందుకూ? పది దాటిపోయింది. పడుకో! మంచం వుందిగా?"

అయోమయంగా చూశాడు. ఇక్కడ పడుకోవటం ఏమిటి?

జానకి కూడా వచ్చింది లోపలికి. విసనకర్ర దూరంగా గిరవాటెట్టింది. తలుపులు బాగా దగ్గిరికి వేసింది. కోపంగా వున్నట్టు మొహం ముడుచుకుంది.

వాసు కొంచెం నవ్వుతూ వదినగారికేసి చూశాడు.

జానకి కోపంగానే నవ్వుతూ — "పాపం మరిది గారిని చూస్తే జాలేస్తోంది. నిజంగానే .... ప్రాణం వుసూరుమంటోంది" అంది నిరాశగా.

వాసు గుండెలు దడదడలాడాయి. తెల్లబోతూ చూశాడు.

"వీళ్ళ కింత బుద్ధిలేదేం వదినా?" అంది పద్మ.

"నెమ్మదిగా అంటావా? వాసుకి కోపం వచ్చినా సరే అత్తగార్నంటున్నానని .... బొత్తిగా మొద్దు మను షులు .... ఉత్త గాడిదలు...."

వాసు అలాగే చూస్తున్నాడు ఆశ్చర్యపోతూ.

"మంచీ చెడ్డా చూసుకుని ముహూర్తం పెట్టుకో వద్దూ? తలవాచేలా చివాట్లు పెట్టి వచ్చాను. పెళ్ళి కూతురు తల్లీ మేనత్తా నోరెత్తితేనా? పెళ్ళికూతురు ముంగిలా కూర్చుంది."

"పాపం, ఆ పిల్లేం చేస్తుంది?" పద్మ జాలిపడింది.

"ఏం? ఏమైందసలూ?" వాసు వుండబట్టలేక పోయాడు. ఏవేవో రీతులూ రివాజులూ అంటూ వీళ్ళం దరూ దెబ్బలాడుకుని రసాభాస చెయ్యరు కదా?

"ఇంకే మవ్వాలి? మీ ఆవిడ చాపా చెంబూ పట్టు కుని వాకిట్లో కూర్చుంది."

అదిరిపడ్డాడు వాసు. జానకికేసి తీక్షణంగా చూశాడు. హాస్యానికైనా వేళాపాళా వుండొద్దూ?

"అంతా బాగానే చూసి పెట్టుకున్నారట పెళ్ళి ముహూర్తం! ఎందుకో ఇలా అయిందట. అసలు పెళ్ళి కూతురికి నెలా కాదట. మరెందుకైందో చిత్రం!" జానకి కోపంగానే చేతులు ఝాడిస్తోంది.

వేళాకోళం కాదా?

వాసు తెల్లబోతున్నట్టు పద్మకేసి చూశాడు.

పద్మ కూడా నిరుత్సాహంగా వుంది — "మనం కూడా ఆలోచించలేదు వదినా! అన్నీ చూసి లగ్నం పెట్టారా అని మనం అడగవలసిందా?

"చాల్లే, సిగ్గులేదు. ఆ ఇంగితం వాళ్ళకి వుండాలి."

తర్వాత వాసుకి ఒక్క మాట కూడా తలకెక్కలేదు. మనసంతా శూన్యం.... శూన్యం అయిపోయింది. స్థాణువులా కూర్చున్నాడు.

జానకీ పద్మా ఇంకా మాట్లాడుకుంటున్నారు.

వాసు హఠాత్తుగా అన్నాడు — "వదినా! అయితేయేం? స్నానం చేసి లోపలి కొస్తుందిగా? నా గదిలోనే పడుకోమనండి!"

"అలాగే అన్నాను వాసూ! అది పనికి రాదట! ఆ పిల్ల మూడు రోజుల దాకా లోపలికే రాకూడదట! నీకు కనపడను కూడా కనపడదు."

మౌనంగా వుండిపోయాడు వాసు.

పద్మ అంది — "వదినా! రేపు మనిద్దరం వెళ్ళిపోదాం. వాసు వుంటాడు. తర్వాత వాళ్ళిద్దరూ వస్తారు."

వాసు ఆశ్చర్యపడ్డాడు. తను వుండాలా? ఎందుకూ? ఆ అమ్మాయిని... గదిలోకి పంపిస్తారనా? ఛీ! "ఊహూ! నేనుండను" అన్నాడు మొహం చిట్లిస్తూ.

"మరి పెళ్ళికూతుర్ని తీసికెళ్ళకుండా అందరం వెళ్ళిపోతే ఎలాగ?"

"ఏమో! నాకు తెలీదు."

"నా మీదా నీ కోపం?" అని నవ్వింది జానకి.

మళ్ళీ వదినా ఆడబిడ్డలు కిందా మీదా పడి ఆఖరికో నిర్ణయం చేశారు — "ఇప్పుడందరం వెళ్ళిపోదాం. నెల లోపల వచ్చి పెళ్ళికూతుర్ని తీసికెళ్దాం."

"ఈ పిల్లకి నెలలు సరిగ్గా రావట. అప్పుడు మళ్ళీ చెంబూ చాపా...." అంటూ నవ్వింది జానకి.

"బాగా చెప్పావ్. అలాంటి వాళ్ళే వీళ్ళు. ఏం వాసూ, అలా చేద్దామా?"

"మీకెలా బాగుంటే అలా చెయ్యండి."

"అయితే తెల్లారగట్ల బండి వుంది మనకి. పోదాం. ఒక్కపూట కూడా వుండకూడదు ఇక్కడ."

"పోనీలే వదినా! వాళ్ళు వింటే బాగుండదు" అంది పద్మ కొంచెం మొహమాటంగా.

"చాల్లే! వాళ్ళ బాగుకి మన బాగు స... డి.... పోయింది కాదు" అంటూ చేతులు తిప్పింది జానకి వెటకారంగా. "ఆ పిల్లస్నానం చేసి లోపలికి రావచ్చుగా? దానికీ తప్పేనా?" అంది మళ్ళీ.

సుజాతకి తండ్రి లేడు. మేనమామే, ఆస్తి వ్యవహారాలు చూస్తున్నాడు. సావిత్రి పెద్దది, సుజాత చిన్నది. మొగపిల్లల్లేరు. ఆస్తి వుంది. పెద్ద డాబా ఇల్లు వుంది. ఆస్తి అంతా అక్కచెల్లెళ్ళకే. సావిత్రికిక ఆస్తితో ఏం పని? తిండీ బట్టా చాలు. పెళ్ళయిన నాలుగేళ్ళకే భర్తపోయాడు. ఆస్తి అంతా సుజాతకే!

వాసు తరుపు వాళ్ళు పెళ్ళికూతురి ఆస్తిని గురించి ఆశపడలేదనటానికి వీల్లేదు. ఉన్నవాళ్ళు పిల్లనిస్తామంటే చేదా, నొప్పా? వాసు మాత్రం భార్యకి రాబోయే ఆస్తికోసమే అమ్ముడుపోలేదు. సుజాతని చూశాడు. నచ్చింది. సుజాత చదువుకుంటోంది. అది ఇంకా నచ్చింది.

ఆస్తితో వచ్చే ఆడపిల్లని స్వీకరించే అర్హతా, యోగ్యతా వాసుదేవరావుకి వున్నాయనుకున్నాడు సుజాత మేనమామ. వరుడు మంచివాడు దొరికినందుకు ఆడపెళ్ళి వాళ్ళు కూడా చాలా సంతోషించారు.

పెళ్ళి అంతా ఆటలా అయింది. ఎక్కడా ఎవ్వరూ ఏమీ అనుకోలేదు. ఆడపెళ్ళి వారు వియ్యాల వారిని కానుకలతో ముంచెత్తారు. పెళ్ళికొడుకు కుటుంబంలో అందరికీ ఖరీదైన బట్టలు పెట్టారు. పెళ్ళికొడుక్కి లాంఛనాలు సరేసరి. అడుక్కో అచ్చటా — మాటకో ముచ్చటా జరిపారు.

వాసు దృష్టి ఏ బహుమతుల మీదా నిలబడలేదు. సుజాత కోసమే నిరీక్షించాడు.

కానీ .... వాసు నిరీక్షణ .... ఇంకా నిరీక్షణగానే వుండిపోయింది!

పద్మా జానకీ మాట్లాడుకుంటూ మాట్లాడు కుంటూనే నిద్రపోయారు.

ఎక్కడినించో జామపండు సువాసన .... ఉన్న ట్టుండి .... వెలగపండు సువాసన .... సంపెంగలు .... సంపెంగలు .... వాసు వేసుకున్న లాల్చీ జేబు లోంచి .... సంపెంగలు గుబాళిస్తున్నాయి.

ఎప్పుడో తెల్లవారు ఝామున నిద్రపట్టేసరికి — "వాసూ! వాసూ!" అంటూ లేపేసింది పద్మ — "లే! లేచి మొహం కడుక్కో. టాక్సీ వచ్చేసింది" అంటూ హడావుడిగా వెళ్ళిపోయింది.

వాసుకేం తోచలేదు. వెళ్ళిపోవడమేనా?

టిఫెన్లూ, కాఫీలూ వచ్చాయి గదిలోకి. వాసు ఏమీ తీసుకోలేదు. పెళ్ళింట్లో ఎవ్వరితోటీ మాట్లాడలేదు. టాక్సీ కదిలే ముందు మాత్రం బావమరిది కోసం వెదికాడు. నిద్రపోతున్నాడేమో! ఎక్కడా కనిపించలేదు.

రైలు చాలాదూరం వెళ్ళిపోయాకగానీ వాసుకి చైతన్యం రాలేదు. తను దోషిలా పారిపోతున్నట్టు సిగ్గు ముంచుకొచ్చింది. ఈ బాధంతా తనకేగానీ సుజాకి వుండదా? ఎందుకుండదూ? ఆ అమ్మాయి మాత్రం బాధపడదూ? నలుగురిలో నవ్వుల పాలయిపోయి నందుకు ఎంత సిగ్గు పడిపోయిందో ఎవరికి తెలుసు? ఆ సంగతి ఒక్కసారైనా ఆలోచించాడా?

నిజంగానే .... వాళ్ళు అన్నీ సవ్యంగా చూసుకునే లగ్నం పెట్టారేమో! ఇలా రసాభాస అవటం వాళ్ళకి మాత్రం బాగుంటుందా? ఇలా జరుగుతుందని వాళ్ళు కలగన్నారా?

తను మరీ పశువులా ప్రవర్తించాడు. ఒక్కరోజు వుండి సుజాతతో మాట్లాడి — వెళ్తానని చెప్పివస్తే ఎంత బాగుండేది! గదిలోకి పంపించలేదని .... ఇలా బయల్దేరి వచ్చెయ్యడం ఎంత జుగుప్సాకరంగా వుందీ!

పెళ్ళి అవనే అయింది. అప్సరసలాంటి భార్య దొరికింది. ఇవ్వాళ కాకపోతే .... రేపు! రేపనుకుంటే మాత్రం సంతోషం లేదా? తనే మూర్ఖుడు. కనీసం భార్యతో మాట్లాడాలని కూడా ప్రయత్నించకుండా .... తన దారిన తను వచ్చేశాడు!

ఆత్మనింద వాసునెంతో సేదదీర్చింది.

★ ★ ★

ఇంటికి వెళ్ళినరోజు రాత్రే వాసు సుజాతకి ఉత్తరం రాశాడు. తను చెప్పకుండా వచ్చినందుకు క్షమాపణ కోరాడు. ఆ రాత్రి గురించి తనెంత ఊహించాడో, తన ఊహలు గాలిలో కొట్టుకుపోతోంటే ఎంత పిచ్చివాడయ్యాడో, వర్ణించాడు. అసలా సంఘటన జరగలేదనీ, మర్చిపొమ్మనీ, బుజ్జగించాడు. అసలు సుజాతని పెళ్ళి చేసుకోటానికి తనెందుకు ఒప్పుకున్నాడో — పెళ్ళి అయిన దగ్గర్నుంచీ తన మనస్సంతా ఎలా అవుతోందో చెప్పుకొచ్చాడు. పెళ్ళి వేడుకల్లో సుజా ఎంత ముద్దుగా వుందో ... కొత్త కుండలో ఉంగరాలు మూడుసార్లూ సుజాతకే దొరకటంలో రహస్యం ఏమిటో బయట పెట్టేశాడు చివరికి. "సుజా! మనం ఇద్దరం ఏకాంతంగా, స్వేచ్ఛగా మాట్లాడుకునే మధుర క్షణాల కోసం వెయ్యి కన్నులతో నిరీక్షిస్తున్నాను. అంతకన్నా ముందు నీ ఉత్తరం కోసం!..... నీ వాసు" అని తన ప్రేమలేఖ ముగించాడు సంతోషంగా.

అప్పట్నుంచీ రోజూ పోస్టుకోసం ఎదురు చూడ డమే. రోజూ దెయ్యంలా కన్పించకుండా పోయే పోస్టుమాన్ దేవుడిలా ప్రత్యక్షమయ్యాడు వారం రోజులకి.

సుజాత జవాబు రాసింది. అది అచ్చం 'జవాబు' లాగే వుంది!

"పూజ్యులైన వాసుదేవరావు గారికి

నమస్కరిస్తూ .....

మిమ్మల్నెలా పిలవాలో నాకు తెలియలేదు. మీరు ఎంతో ప్రేమతో రాశారు ఉత్తరం. నేనలా రాయ లేనని భయంగా వుంది. మీరు వెళ్ళిపోయినందుకు నేను మీ గురించి చెడ్డగా ఏమీ అనుకోలేదు. నా గురించే మీరు ఏమైనా అనుకుంటారని భయపడ్డాను. నాతో మాట్లాడే అవకాశం లేకే మీరు వెళ్ళిపోయారు. అందులో తప్పేముంది? పెద్ద వాళ్ళంతా ఏదో మాట్లాడుకుని నిర్ణయించుకున్నారు కదా?

కాలేజీలు తెరిచారు. నేను సెకండియర్ పాస య్యానని మీకు తెలుసు కదా? ఇక ఆఖరి సంవత్సరం వుంది. మళ్ళీ కాలేజి చదువు, అదో ప్రపంచం. నేను వెంటనే జవాబు రాయలేకపోయాను, మన్నించండి.

-సుజాత

చాలా అసంతృప్తి కల్గించిందా ఉత్తరం వాసుకి. చదివిందే పదిసార్లు చదివాడు. సుజాత ప్రేమగానే రాసింది. కాదనలేడు. కానీ 'పూజ్యులైన' ఏమిటి? అదేం పిలుపు? పాతకాలపు పతివ్రతల్లాగ! 'ప్రియ మైన' అనకూడదూ? .... పోనీలే .... 'ఎలా పిలవాలో తెలీడం లేదు' అంది కదా? తోచలేదేమో! .... అయినా మిగిలిన ఉత్తరంలో కూడా అంత పొడి .... పొడిగా .... రాసిందేమిటి? చిన్నపిల్లలు రాసినట్టు! పరాయి వాళ్ళకు రాసినట్టు! ఉత్తరం చివర్లో 'నీ సుజాత' అనకూడదూ? .... ఏమీ నచ్చలేదు వాసుకి. బి. ఏ. చదువుతోన్న అమ్మాయి ...... కొత్త పెళ్ళికూతురు ..... తన భర్తకి రాసుకోవాల్సిందేమీ లేదా? ఆ రాత్రి .... తను ఎలా ముస్తాబవుదామనుకుందో .... ఎలా మాట్లాడుదామనుకుందో .... తీరా అంతా తారుమారైతే .... ఎంత దిగులు పడిపోయిందో .... అదంతా .... ఎందుకు రాయకూడదు? తనేం పరాయివాడా? ఇంకె వరికి చెప్తుంది? మనసంతా విప్పి చెప్పుకుంటే ఎంత హాయిగా వుంటుంది!

అయినా .... పెళ్ళంటే అయింది. మెడలో పుస్తి పడిందిగానీ, అంతకు మించి ఇద్దరికీ ఏం పరిచయం వుంది? ఒక్కమాట కూడా మాట్లాడుకోలేదు. ఇంత కన్నా ఆత్మీయత ఎలా వస్తుంది? సుజాతని తప్పు పట్టడంలో అర్థం లేదు.

వెంటనే ఆ రాత్రి ఇంకో ఉత్తరం రాశాడు వాసు.

జవాబుకోసం ఎదురు చూడకుండానే మూడోది రాశాడు. రోజూ ఓ ఉత్తరం రాస్తోనే వున్నాడు.

అసలు ఆ రోజు అలా జరగడమే బాగుంది. ఆ సంతోషం ఇంకా ముందు ముందు వుందనుకుంటే .... దానికోసం కలలు కంటోంటే .... హాయిగా వుంది. అనుభవంకన్నా నిరీక్షణే మధురంగా వుంటుందేమో!

వధూవరులు దూరంగా వుంటూ, ఉత్తరాలు రాసుకోవటంలో ఆనందం వాసుకి కొత్తగా వుంది ... సుజా ఉత్తరాల్లో ఉత్సాహం వుంటే వాసుకి ఇంకా సంతోషం కలిగేది.

★ ★ ★

పెళ్ళయి పద్దెనిమిది రోజులు దాటింది.

సుజాత మేనమామ దగ్గిర్నించి ఉత్తరం వచ్చింది, వాసూ వాళ్ళకి. సుజాతకి వారం రోజుల నుంచీ జ్వరం వస్తోందట. నెల్లాళ్ళ నుంచీ ఆ పిల్లకి నలతగానే వుంటోందట. కాలేజికి కూడా వెళ్ళటం లేదట. విశ్రాంతి అవసరం అని డాక్టరు గారన్నారట. అల్లుడి గారి యోగక్షేమాలు తెలియజెయ్యాలట — అదీ విషయం!

"అయ్యో! పిల్ల ఎలా వుందో!" అంది వాసు తల్లి.

"మళ్ళీ మరిది నోట్లో పచ్చివెలక్కాయ పడింది" అంది జానకి నవ్వుతూనే.

అత్తగారు రాయించిన ఉత్తరం వాసు కూడా చూశాడు. ఇంట్లో వాళ్ళ మాటలూ విన్నాడు. మాట్లాడ కుండా ఊరుకున్నాడు. "చదువులోపడి ఆరోగ్యం నిర్లక్ష్యం చెయ్యకు నీ ఒంట్లో ఎలా వుందో ఎప్పటి కప్పుడు రాస్తూ వుండు" అని సుజాతకి వెంటనే రాశాడు.

సుజాత జవాబులు ఇచ్చినా ఇవ్వకపోయినా పట్టించుకోడు. ఏ క్షణానికి తన మనసెలా వుంటుందో డైరీ రాసినట్టు రాస్తాడు. ఒక్కోరోజు అర్థరాత్రి లేచి కూర్చుని తెల్లవార్లూ రాస్తూ వుంటాడు. కొత్త సంగతు లేమీ తోచనప్పుడు రాసిందే రాస్తాడు. తామిద్దరూ ఎలాగో అయిపోవాలంటాడు. ప్రేమా — అనురాగం — కౌగిలీ ముద్దులూ లేకుండా కలం పరిగెత్తదు. ఏది రాయటానికీ సిగ్గువెయ్యదు. సుజా జవాబులెందుకు రాయదని ఆలోచించడం మానేశాడు.

మూడు నెలలు దాటినా వియ్యాల వారినించీ ఏ కబురూ లేకపోతే, వాసు తల్లికి చాలా కోపం వచ్చింది. తనే ఒక ముహూర్తం చూపించి "ఆనాటికి అన్నీ ఏర్పాటు చెయ్యండి" అని వియ్యాల వారికి రాసె య్యాలనుకుంది.

ఆ రోజు, ఇంటికి వాసు వచ్చేటప్పటికి పిలక పంతులు గారొకాయన పంచాంగం విప్పి విభూతి బొట్లు రాలిపడేలా నుదురు చిట్లిస్తూ తిథి నక్షత్రాలు చూస్తున్నాడు. వాసుకి పంతులు సాక్షాత్తూ బ్రహ్మ దేవుడిలా కనపడ్డాడు. ముసిముసి నవ్వులు నవ్వు కుంటూ గదిలోకి వెళ్ళిపోయాడు.

జానకి కాఫీ తెచ్చిచ్చింది. పంతులు గారు తాగి గొంతు సర్దుకున్నాడు. "అమ్మా! ఆషాఢం వల్లకాదు గదా? అది అందరికీ తెలిసిందే! .... శ్రావణం చుక్క

మూఢమి. తెల్లవారు ఝామున చుక్క పొడుస్తుంది చూశారూ, అది మూఢాన పడింది. ఆవటా .... అదీ వల్లకాదు .... భాద్రపదం .... శూన్యం — లాభం లేదు. వరసగా ఈ మూడు నెలలూ గడ్డురోజులు తల్లీ! శుభకార్యాలమాట ఎత్తనేకూడదు."

వాసుకి మొదటేమీ అర్థం కాలేదు. పంతులేవో మంత్రాలు చదువుతున్నా డనుకున్నాడు. వినగా .... వినగా అవి మంత్రాల్లాలేవు. ఏమిటో .... శూన్యం అంటున్నాడు. మూఢమి అంటున్నాడు .... శుభకార్యం అంటున్నాడు .... వల్లకాదంటున్నాడు.

అదిరే గుండెలతో, కాలు నిలవక, బయటికి రాలేక, వాసు బోనులో సింహంలాగ గదిలో తిరిగాడు.

జానకి మాటలు వినిపించాయి. అత్తగారితో అంటోంది — "మీ చాదస్తంగానీ పెళ్ళి అవనే అయింది. ఇక మొగుడూ పెళ్ళాలకి మంచేవిటి చెడ్డేవిటి?"

"అమ్మో! అలా అనకు. అసలు శోభనం ముహూర్తమే మంచిదుండాలి. లేకపోతే కీడు కొడుతుందంటారు. ఇప్పుడేం మించిపోయింది? అయిన ఆలశ్యం ఎలాగూ అయింది. మూడు నెలలు ఎన్నాళ్ళలో గడుస్తాయి? ఆర్నెల్లపాటు పెళ్ళే అవలేదనుకుంటే సరీ" అంటోంది తల్లి.

వాసు తల గిర్రున తిరిగింది. పట్టరానంత కోపం వచ్చింది. "ఏం, మూఢంలో అయితే, ఏమౌతుంది? ఏమీ కాదని నేను ఛాలెంజ్ చేస్తాను" అని పంతులు మీదికి యుద్ధానికి వెళ్దామనిపించింది.

అమ్మ తనని అడగ్గానే — "నా కిల్లాంటి పిచ్చి పిచ్చి నమ్మకాల్లేవు" అనేద్దామని నించున్నాడు.

వాసుతో ఎవరూ సంప్రదించలేదు. హాస్యమాడటానికి కూడా జానక్కి మనసు వొప్పలేదు. అత్తగారితో వాదిస్తోనే వుంది. ఆవిడ ససేమిరా కోడలి మాట వినలేదు. పంతులు కూడా ఆమెకి వంతపాడుతూ "అమ్మా! దుర్ముహూర్తంలో పుట్టే బిడ్డలు రాక్షసులౌతారు. దంపతులకు ఆయుఃక్షీణం...." అన్నాడు.

"నీ నెత్తి! నీ పిండాకూడు! నీకు కాఫీ దక్కుడు" అని తిట్టుకున్నాడు వాసు.

వాసు తల్లి ఐదు రూపాయలు తమల పాకుల్లో పెట్టి అందించింది పంతులు గారికి.

పంతులులేచి పంచాంగం కట్ట కట్టి చంకనెట్టుకుని పిలక వూగించుకుంటూ వెళ్ళిపోయాడు.

పంతులున్నంతసేపూ కోపం వచ్చిందిగానీ, అతగాడు వెళ్ళిపోయాక ఆడపిల్లలా ఏడ్చెయ్యాలనిపించింది వాసుకి. కొయ్యబారి కూర్చున్నాడు గదిలో.

జానకి కాఫీ ఇచ్చి వెళ్ళబోయింది.

"అక్కర్లేదు. తీసుకుపో" అన్నాడు.

"ఏం?" అంది తెల్లబోతూ.

"ఏం లేదు" అన్నాడు కోపంగా. తన వ్యవహారంలో తనకేమీ స్వతంత్రం లేదా? తనతో మాట మాత్రమయినా చెప్పక్కర్లేదా?

వాసు కోపం ఎందుకో పసిగట్టి జానకి అత్తగారికి చెప్పింది.

ఆవిడ ఓ నవ్వు నవ్వింది — "నాయనా వాసూ! రేపు మీ అత్తారికి ఉత్తరం రాయాలి. పంతులుగారు చెప్పిందంతా విన్నావుగా? పోనీ పిల్లగల వాళ్ళు ఒప్పుకుంటారేమో చూద్దాం. వాళ్ళెలా అంటే అలా చేద్దాం" అంది అనునయంగా, వాళ్ళేలాగూ ఒప్పుకోరన్న ధైర్యంతో.

ఆ ఓదార్పుతో తనకు ఒరిగిందేమీ లేదనుకున్నాడు వాసు. అల్లాంటి నమ్మకాలు లేని వాళ్ళెవరు? తను ఇప్పుడే జరగాలనటం... వాళ్ళు కాదనటం... అదో రభస! ఎంత చీదర! ఛీ! సిగ్గుచేటు! సున్నితంగా జరిగే వ్యవహారాలు సున్నితంగానే జరగాలి — ఎంత కాలమైనా సరే!

ఆ రాత్రి చాలాసేపటివరకూ సుజాతకి ఉత్తరం రాస్తూనే కూర్చున్నాడు వాసు. వెర్రివెధవలు పెట్టిన పిచ్చి ఆచారాన్ని దుయ్యబట్టాడు. బుర్రలుపెట్టి ఆలోచించకుండా, ఇంగితం లేకుండా, గాలికీ దూళికీ భయపడిపోయే చచ్చు పీనుగుల్ని తిట్టిపోశాడు. అసలు ఒక నెలని మంచిదిగానూ ఇంకో నెలని చెడ్డదిగానూ విడదీసిన వెధవల్ని శాపనార్థాలు పెట్టాడు — "సుజా! ఇదంతా ఉత్త బూటకం. నేను బొత్తిగా నమ్మను. కానీ ఏం చెయ్యను? మనం ఇద్దరం స్వతంత్రించి నిర్ణయాలు చేసుకోవచ్చు. కానీ, నీ అభిప్రాయాలు నాకు తెలియడం లేదు. పెళ్ళికి ముందు మన మధ్య ఎంత దూరం వుందో ఇప్పుడూ అలాగే వుంది. నేను పిరికివాడినై మౌనంగా ఉంటున్నా

నసుకోకు. మనం కలవడం కోసం వీళ్ళందరితో తగువులు పడాలంటే చీదరగా వుంది నాకు.

ఇదంతా ఆలోచిస్తే ఈ మూడు నెలలూ పెద్ద వాళ్ళ నమ్మకాల ప్రకారం పోదామనిపిస్తోంది. సరదాగా చెప్పుకోవాలంటే, 'విధి' క్రూరంగా మనల్ని వేరు చేస్తోంది. చివరికి ఎవరు నెగ్గుతారో చూద్దాం. నిన్ను నా కౌగిట్లో బంధించుకుని విధిని వెక్కిరించక పోతానా? అద్దాలవంటి నీ చెక్కిళ్ళలో .... నన్ను నేను చూసుకుంటూ ..." వాసు కలం .... వినయ విధేయత లతో, వాసు ఊహల్ని అక్షరాల్లోకి తర్జుమా చేస్తూ లేడిలా పరుగులు తీస్తోంది.

వాసు కళ్ళెదుట సుజాత ప్రత్యక్షమైంది.

మందహాసాలు ఒలికిస్తూ వయ్యారాలు పోతోంది. వాలు చూపులతో కులుకు నవ్వులతో రెచ్చగొడు తోంది. వాసు కన్నులు ఎర్రగా ఎరుపు తేలాయి. నుదు రంతా చెమటపట్టింది. ఊపిరి సెగలు రేగుతోంది. ఏం రాస్తున్నాడో ఎలా రాస్తున్నాడో ఆలోచించలేదు. అవి రామంగా శ్రమించి అలిసిపోయినట్టు కలం ఆపు చేశాడు.

అస్తవ్యస్తంగా పడివున్న కాయితాలన్నీ సర్దాడు. ఉత్తరం చదువుతోంటే వాసుకే సిగ్గు ముంచు కొచ్చింది. ఇలాంటి ఉత్తరం చదివి ఆ అమ్మాయి ఏమనుకుంటుందో! చిరాకు పడుతుందేమో! ఆశ్చర్య పోతుందేమో! కోపం వస్తుందేమో! పోనీ అదీ చూద్దాం. నా భార్యకు రాశానుగానీ పరాయి వాళ్ళకు రాశానా? నా ఇష్టం; ఇంకా రాస్తాను.

ఆ ఉత్తరం మర్నాడు పోస్టుకెళ్ళింది.

వారం రోజులైనా జవాబు లేదు. వాసు కుతూ హలం దిగులుగా మారింది. సుజాని చికాకు పెట్టి నందుకు భయం వేసింది. అభమూ శుభమూ తెలీని ఆడపిల్లకి మొగుణ్ణి కదా అనే అధికారంతో అస్తవ్యస్తపు రాతలు రాయటం ఏం సంస్కారం? సుజాత తనని గురించి సున్నితంగా, ఉన్నతంగా ఊహించుకుంటూ వుంటుందేమో! అదంతా ధ్వంసం చేసుకున్నాడా? మొరటు మనిషిలా మూర్ఖుడిలా సాక్షాత్కరిస్తాడా? ఎంత తొందర!

"సుజా! నీకు కోపం వచ్చిందా? నామీద అసహ్యం వేసిందా? నన్ను క్షమించవూ? నా ఆలోచన లేవీ నా వశంలో లేవు. ఇంకా ఈ ఎడబాటు కొన్నాళ్ళు సాగితే నేను ప్రాణాలతో వుంటాననే నమ్మకం నాకు లేదు. ఎప్పుడో హఠాత్తుగా నా మృత్యువుని చూడ టానికే నువ్వు రావాలి. అప్పుడు నేను నీకేమీ చెప్ప లేను. నన్ను చూసి భయపడి దూరంగా వుండిపోకు. నన్ను నీ ఒడిలోకి తీసుకుని నీ హృదయానికి హత్తుకో! నా మృత కళేబరం మీద నీ సున్నితమైన పెదవులతో ముద్దుల వర్షం కురిపించు! అప్పటికిగానీ నా ఆత్మ శాంతించదు. లేకపోతే, అది చెట్లూ పుట్టలూ పట్టుకుని తిరుగుతూనే వుంటుంది. నన్ను హఠాత్తుగా మృత్యువు ఎత్తుకు పోతే కడసారిగా నిన్ను కోరే కోరిక ఇది ఒక్కటే. నువ్వు ముద్దులు పెట్టుకోకపోతే నా కళేబరానికి ముక్తి వుండదు."

ఆ ఉత్తరానికి సుజాత వెంటనే జవాబిచ్చింది — "మీ ఉత్తరం చూస్తే నాకు భయం వేసింది. ఏడు పొచ్చింది. ఎందుకలా రాశారు? ఇంకెప్పుడూ అలా రాయకండి!"

సుజా బిక్కమొహం వేసి అమాయకంగా అడు గుతూ కన్పించింది. వాసు చాలా బాధపడ్డాడు, సుజాని అంత కంగారు పెట్టినందుకు.

★ ★ ★

ఆ మూడు నెలలు — దుర్భరంగా — దుస్స హంగా గడిచాయి వాసుకి. కనుచూపు మేరలో అశ్వ యుజం తొంగిచూస్తోంది. రెక్కలు తటపటలాడిస్తూ గరుడపక్షి నిద్ర లేచినట్టు మేలుకుంది వాసు ఊహ లోకం.

వారం పదిరోజుల్లో ముహూర్తం పెట్టబోతారనగా సుజాత దగ్గర్నించి ఒక ఉత్తరం వచ్చింది వాసుకి.

ఆ ఉత్తరం చదివి నిర్ఘాంతపోయాడు వాసు. తల పది తలల్లాగ గిర్రున తిరిగింది. అసహనంతో వెర్రివాడిలా ఆ ఉత్తరం చించి పారేశాడు.

భర్తని ప్రాధేయపడుతూ రాసింది సుజాత — ఆ సంవత్సరానికిక ఆ సంగతి ఎత్తవద్దని! తనకి ఆఖరి సంవత్సరం. కాలేజీ చదువుకీ, ఈ సంసార జీవితానికీ సమన్వయం కుదుర్చుకోవటం తనకు సాధ్యం కాదనీ, దయచేసి తనని అర్థం చేసుకోవాలనీ.

వాసు దీర్ఘంగా నిట్టూర్చాడు. వ్యథనంతా నిట్టూ

ర్పులా వదిలేశాడు.

వాసు ఇంటికి వచ్చేసరికి పంచాంగం పంతులు తిథి నక్షత్రాలు చూస్తూ కన్పించాడు.

వాసు గదిలోకి వెళ్తూ — "వదినా!" అని పిల్చాడు.

జానకి వచ్చింది నవ్వుతూ — "నీ కష్టాలు గట్టెక్కా యిలే వాసూ!" అంది.

"గట్టెక్క లేదు. నా నెత్తెక్కాయి" అన్నాడు నవ్వూ కోపం మిళాయించి.

"ఇంకా ఎందుకంత చిరాకూ? ముహూర్తం పెట్టిం చేస్తుంటేనూ."

"అందుకే పిల్చాను. ఇప్పుడేమీ వద్దు. అమ్మకి చెప్పు."

"అదేమిటి? నిజంగానే!"

"నిజమే వదినా! సుజాకి ఈ సంవత్సరం ఫైనల్ కదా? తనకిష్టం లేదని రాసింది. ఆలోచిస్తే నాకూ ఇష్టంలేదు. ముహూర్తం అదీ ఇప్పుడు వద్దు."

జానకి తెల్లబోతూ వెళ్ళిపోయింది.

"ఏమిట్రా వాసూ?" అంటూ వచ్చింది తల్లి — "ఇప్పటికే ఆర్నెల్లు దాటిపోయింది. చదువు ముందా, సంసారం ముందా? ఇదేం తిక్క నీకూ?"

వాసు బలవంతంగా నవ్వు తెచ్చుకున్నాడు — "ఇప్పుడొద్దులేమ్మా! వేసంకాలం చూద్దాం."

"హవ్వ! నవ్విపోతారెవరన్నా! మూడు ముళ్ళూ వేసి వచ్చావు. ఈ ఘడియవరకూ పెళ్ళికూతుర్ని గుమ్మలోకి తీసుకురాలేదు. ఇప్పటికే సిగ్గుతో చస్తున్నాను .... ఆ అడ్డుకాస్తా తీరిపోతే .... ఆ అమ్మాయి వస్తూపోతూ వుంటుంది."

జానకి అందుకుంది— "ముహూర్తం పెట్టనియ్యి వాసూ! సుజాతని మన ఇంటికి తీసుకు రావాలి. దానికైనా మంచిరోజు వుండాలిగా?"

"ఊహు! ఏకంగా ఒక్కసారే వస్తుందిలే. ఇప్పుడేం వద్దు." ఖచ్చితంగా చెప్పేశాడు వాసు.

వాసు అన్నకూడా తమ్ముడి పాయింటే మాట్లాడాడు. సుజాత పరీక్షలయ్యే వరకూ ఎలాంటి లగ్గాలూ గిగ్గాలూ వుండకూడదని కొట్టిపారేశారు.

వాసుకి చాలా సంతోషం కలిగింది. సుజా తన సంస్కారాన్ని అర్థం చేసుకుంటుందనీ, తనని ఇంకా ప్రేమిస్తుందనీ.

వాసు సుజాతకి ఉత్తరాలు రాయటం చాలా తగ్గించాడు, పరీక్షలకు చదువుకోవలసిన సుజాని డిస్టర్బ్ చెయ్యకూడదని.

★ ★ ★

ఆ రాత్రే శోభనం వాసుకి! దాని కోసం వాసే కళ్ళు కాయలు కాచేలా నిరీక్షించాడు కాబట్టి, అది వాసు శోభనమే.

వాసుతో జానకి ఒక్కతే వచ్చింది వియ్యాల వారింటికి. రాత్రి శోభనం అనగా ఉదయం బండి దిగారు.

ఇంట్లో చుట్టాలెవరూ లేరు. బండి దిగి జానకి లోపలికి వెళ్ళి తోడికోడల్ని చూసింది.

"బాగున్నావా?" అంది.

కొంచెం నవ్వి ఊరుకుంది సుజాత.

పగలంతా సుజాతని శల్యపరీక్షలు చేస్తోనే వుంది జానకి. సుజాత ఈ కాలపు పిల్లలా లేదు. ఎక్కువగా మాట్లాడదు, నవ్వదు. ముభావంగా తనకేవీ పట్టనట్టు వుంటుంది. ఎందుకైనా దిగులా అంటే, ఆ పిల్ల దిగులు పెట్టుకునే కారణాలేవీ కన్పించలేదు జానక్కి. అది ఆ పిల్ల తత్వమా? మొగుడూ పెళ్ళాలు ఒకటైతే సరి. అన్ని దిగుళ్ళూ పోతాయి.

సుజాత కన్నా వాళ్ళక్క సావిత్రి హుషారుగా కన్పించింది జానక్కి. ఆ పిల్ల సుజాత అంత రూపసి కాదుగానీ, అందమయిందే. సుజాత కన్నా నాలుగేళ్ళు పెద్దది. అప్పుడే ఆ పిల్ల అందచందాలన్నీ బూడిదలో పోసిన పన్నీరయిపోయాయి.

తన శకునం మంచిది కాదని సావిత్రి ప్రతి పనికీ దూరదూరంగా వుంటుంది. ఏ పనికీ తనకై తను కలగ జేసుకోదు. శుభ సమయాలలో తనని చూసుకుని తనే భయపడి దాక్కుంటూ వుంటుంది. జానకి చీటికీ మాటికీ సావిత్రిని పిలుస్తూ పలకరిస్తూ ముచ్చట్లాడుతూ గడిపేసిందా పగలంతా.

దీపాల వేళయింది.

గది సర్దాలన్న ధ్యాసే ఎవ్వరికీ వున్నట్టు లేదు ఇంట్లో. కాస్సేపు చూసి సావిత్రిని అడిగింది జానకి.

"ఏమో! అమ్మకీ అత్తయ్యకీ ఏం తెలుస్తుంది? నా

చెయ్యి పెట్టటం ఎందుకని వూరుకున్నాను. సుజా గది వుందిగా? అన్నీ మీరు సర్దండి" అంది సావిత్రి. జానకే ఉత్సాహం తెచ్చుకుని సావిత్రిని వెంటబెట్టుకుని మామూలు గదిని 'శోభనం గదేమో' అనుకునేలా చేసింది.

తర్వాత సుజాతని ముస్తాబు చెయ్యటంలో పడింది. తోటికోడలికి మల్లెపూల జడ కుడుతూ హాస్యాలాడింది. "ఇదిగో అమ్మాయ్! చెల్లెలితో హాస్యం ఆడుతున్నా ననుకోకు. ఇంత కష్టపడి పూల జడ కుట్టించుకునే దెందుకనుకున్నావు? దీనితో ఒక దెబ్బ వేశావంటే రేపు ఆ వాత పెళ్ళికొడుకు చెంపమీద మా కందరికీ కనపడాలి" అంది.

సావిత్రి ముసిముసి నవ్వులు నవ్వింది. అంత లోనే దిగులుగా చూస్తూ కూర్చుంది.

సుజాత కిక్కురుమనలేదు. జవాబు చెప్పలేదు. కనీసం నవ్వు దాచుకుంటోన్న ప్రయత్నమైనా కన్పించ లేదు.

జడ కుట్టటం అయ్యాక జానకి సుజాత మొహాన అందంగా తిలకం దిద్దింది. కట్టుకోటానికి అత్తారింటి దగ్గర్నించి తెచ్చిన జరీపువ్వుల చీర తీసి ఇచ్చింది — "ఇది మీ ఆయనే స్వయంగా కొన్నాడు. నీకు నచ్చక పోతే గదిలో కెళ్ళగానే విప్పి అతని మొహాన పారెయ్" అంది.

ఫక్కుమంది సావిత్రి. తప్పు చేసిన దానిలా సిగ్గు పడిపోయింది.

సుజా మాట్లాడలేదు. ఎవరివైపూ చూడలేదు. పైటకొంగుని పరీక్ష చేస్తున్నట్టు దాన్ని చూస్తూ కూర్చుంది.

పెద్ద పిల్లకి లక్షణంగా వేడుకలన్నీ చేస్తే అచ్చి రాలేదట. అందుకని పేరంటాళ్ళూ ఫలదానాలూ బ్రాహ్మణులూ మంత్రాలూ ఏవీ పెట్టుకోలేదట. జానక్కేం నచ్చలేదు. రుసరుసలాడుతూ వచ్చింది. మరిది గదిలోకి "వీళ్ళంతా ఉత్త ఎడ్డి మనుషుల్లా వున్నారు. ఓ సరదా లేదు, పాడూ లేదు."

వాసు నవ్వాడు "పెత్తనం చేద్దామని వచ్చావు. నీ సరదా తీరినట్టే లేదు."

రాత్రికెప్పుడో ఇల్లు మాటుమణిగింది.

జానకి వాసుని ఆ గది ముందుకి తీసికెళ్ళి, "వెళ్ళి పడుకో, సుజాత వస్తుందిలే" అని చెప్పి వెళ్ళి పోయింది.

వాసు గుండెలు దడదడా కొట్టుకుంటూ గదిలో అడుగుపెట్టాడు. ఒక్క చూపులో నాలుగువైపులా చూశాడు. గది చాలా నచ్చింది. అగరవొత్తుల పొగలతో సువాసనలతో నిండి వుంది. ఎక్కడినించో గులాబీ సెంటు పరిమళం మొహానికి తాకింది. ఒక్కడూ గది మధ్య నించున్నాడు. 'కల ఇన్నాళ్ళకి నిజం అయింది' అనుకుంటూ!

సుజాతని ఎప్పుడో చూశాడు. ఇప్పుడు క్షణానికో ఘడియకో .... చూస్తాననుకుంటే .... బ్రహ్మానందంగా వుంది.

వాసు మనస్సు మూగపోయినట్టయి పోయింది. అలలు ఆగిపోయి ప్రశాంతంగా తేరుకున్న సరస్సులా వుంది. మబ్బులన్నీ చెదిరి చల్లని వెన్నెల కాసే ఆకా శంలా వుంది. సంవత్సరం కిందట వాసు నిరీక్షించిన ఆ రాత్రికీ ఈ రాత్రికీ యోజనాల వ్యత్యాసం వుంది. ఆ నాటి ఉద్వేగమూ తొందరపాటూ ఇప్పుడు లేవు. అది ఉత్త ఆశ! ఇప్పుడు సుజా అంటే అణువణువునా అనురాగమే.

క్షణమో .... ఘడియో .... అనుకుంటూ గంట పైగా గడిపాడు.

ఉక్కతో గుర్తు వచ్చి, లేచి ఫాన్ వేసి మళ్ళీ కూర్చు న్నాడు. కూర్చోబుద్ధిగాక నెమ్మదిగా పచార్లు సాగిం చాడు. గోడ దగ్గిర నించుని వరసగా ఫోటోలు చూశాడు.

ఒక ఫోటోలో ఇద్దరమ్మాయిలు. కుడివైపున సుజాత. పదహారేళ్ళ వయస్సుంటుంది. ఎడమవైపు .... వాళ్ళ అక్క. వాసు ఎప్పుడూ ఆమెని చూడలేదు. సావిత్రి గురించి విన్నాడు. 'దురదృష్టవంతురాలు' అనుకున్నాడు.

ఇద్దరిలోనూ సుజాత అందంగా వుంది. ఇప్పుడైతే, పువ్వుకి సువాసన పట్టినట్టు ఆకర్షణగా కూడా వుండి వుంటుంది.

మందహాసం చిందిస్తూ సుజా ఫోటోనే చూస్తూ నించున్నాడు.

జానకి గంటనుంచీ చెప్తోంది సుజాతకి — "వెళ్ళమ్మా! గదిలోకి వెళ్ళిపడుకో" అని.

"వెళ్తాలెండి" అనటం తప్పితే కదలదు సుజాత.

ఇంట్లో అందరూ నిద్రలు పోతున్నారు.

సుజాతక్కూడా నిద్రకళ్ళపడుతోంటే జానకి కొంచెం విసుక్కుంది కూడా. "ఇక్కడే నిద్రపోయేలా వున్నావు. పాపం మీ ఆయన ఎదురుచూస్తూ వుంటాడు. నీ ఇష్టం మరి" అనేసి తను నిద్రకి పడింది.

సుజాత చాలాసేపు ఒక్కతే కూర్చుంది. చేతుల మధ్య చెంపలు కప్పుకుంది. దీర్ఘంగా నిట్టూర్చి లేచి నిలబడింది. నెమ్మదిగా అడుగులు లెక్కపెడుతూ ఆ గదిలో అడుగుపెట్టి గుమ్మందాటి తలుపులు లోపలికి వేసి వెనక్కి తిరిగింది.

గోడమీద ఫొటోలు చూస్తోన్న వాసు తుళ్ళిపడి తల తిప్పాడు.

సుజాత తల దించేసుకుంది.

వాసు అక్కడే నిలబడిపోయాడు.

సుజా — పూలజడ వేసుకుంది. జరీపువ్వుల చీర కట్టుకుంది. ఒంటినిండా నగలు పెట్టుకుంది. దేవ కన్యలా ప్రత్యక్షమైంది.

వాసు బాహ్యస్మృతి కోల్పోయాడు.

కలలోలాగా నడిచాడు.

సుజాత అయస్కాంతంలా వాసుని నిలబడనివ్వ కుండా ఆకర్షిస్తూ వెర్రివాణ్ణి చేసింది. తన్మయత్వంతో సుజా చుట్టూ చేతులు వేశాడు. గుండెలకి హత్తు కున్నాడు. కళ్ళు చెమర్చుతోంటే నిట్టూర్చాడు.

"సుజా" అప్రయత్నంగా అన్నాడు. "ఎన్నాళ్ళ కెన్నా ళ్ళకి!" అంతకుమించి మాటలు రాలేదు. ఎంతో చెప్పాలనీ, అవిరామంగా మాట్లాడాలనీ తహతహ లాడుతోంది హృదయం — "సుజా! ఈ రోజుకోసం ఎన్నాళ్ళుగానో నిరీక్షించాం కదూ? నిజం చెప్పనా? .... అసలు ఇలాంటి రోజు రాదేమోనని భయపడ్డాను నేను. నవ్వుతావేమో! దేవుడు ఉన్నాడులే. నా మొర విన్నాడు. సుజా! నీకోసం .... నేనెంత తపించానో తెలుసా?" అని చెప్పాలని ఉవ్విళ్ళూరింది మనసు.

కానీ అతను కూడా అనుకున్నంత ధైర్యంగా లేడు. ఆ మాటలు చెప్పాలంటే, అర్థంకాని సిగ్గూ జంకూ అడ్డు వస్తున్నాయి.

సుజాత తలదించుకుని ప్రతిమలా నిలబడి వుంది.

వాసు తన్మయంగా చూశాడు. చూసి చూసి అన్నాడు — "సుజా! నువ్వు ఎంత అందంగా వున్నావో తెలుసా?"

సుజాత తల ఎత్తలేదు.

ఆమె ఏమీ మాట్లాడడం లేదని అప్పటికి తోచింది.

ఆశ్చర్యంగా చూశాడు. "ఎందుకలా వున్నావు? .... ఒంట్లో బాగాలేదా?"

కాదన్నట్టు చూసింది.

వాసు సుజా పూలజడ చేతుల్లోకి తీసుకుని చూశాడు.

"మాట్లాడకూడదా? నోట్లో ముత్యాలు పెట్టుకుని వచ్చావా?"

సుజా నవ్వలేదు. నిశ్శబ్దంగా మొహం తిప్పు కుంది.

అప్పటికి సుజాత ఒక్కమాట కూడా మాట్లాడ లేదు. వాసు రెండు అరిచేతులూ సుజా చెక్కిళ్ళకు చేర్చి పద్మంలా వున్న ముఖాన్ని దోసిట్లో పట్టుకుని సుజా కళ్ళలోకి చూడబోయాడు. తృళ్ళిపడ్డాడు! సుజా కనుకొలుకుల్లో ముత్యాలంత కన్నీటి బిందువులు .... నిలవలేక జారి వాసు చేతుల మీద పడ్డాయి.

వాసు కంగారుగా చేతులమీద పడ్డ కన్నీళ్ళనీ ..... సుజా మొహాన్నీ అయోమయంగా చూశాడు — "ఏమిటిది, సుజా? ఇలా వున్నావేమిటి? నేనేమన్నా ననీ?"

సుజా కన్నీటితో తడిసిన కంటిరెప్పల్ని అల్ల లార్చుతూ దీనంగా అంది — "నాకెందుకో .... భయంగా .... వుంది."

"భయంగా వుందా? .... ఎందుకూ? నన్ను చూస్తేనా?" నవ్వాడు.

"ఊహూఁ! కాదు. అసలు...."

"ఏమిటి? చెప్పు సుజా! చెప్పకపోతే నాకెలా తెలుస్తుంది? నేను పరాయివాడినా? మనిద్దరిమధ్యా భయాలూ ..... సంకోచాలూ .... ఏమీ వుండకూడదు. మనం చక్కగా మాట్లాడుకోవాలి."

"అది కాదు!" తల దించేసుకుంది సుజాత. ఒక్క క్షణం ఆగి తలెత్తి వాసు మొహంలోకి చూసింది — "నా గురించి మీరేమిటేమిటో ఊహించుకుంటున్నారు

.... ఎలా చెప్పను? .... అసలు .... ఇదంతా నాకిష్టం లేదు."

"ఇష్టంలేదా? .... ఏది? .... ఏదంతా?" తెల్లబోతూ అడిగాడు వాసు.

"ఇదే .... ఈ శోభనం.... ఇలాగ ఛీ! నా కిష్టం లేదు" సుజా కంఠం పూడిపోయింది.

అసలు వాసుకేమీ అర్థంకాలేదు. వెర్రిచూపులు చూశాడు.

సుజాత చెంపలమీద కన్నీళ్ళు ధారలు కడుతున్నాయి — పులిపంజాలో చిక్కుకున్న లేడికూనలాగ గజగజలాడుతూ అంది "నన్ను చంపెయ్యండి, అడ్డురాను .... కానీ .... నన్ను ముట్టుకోవద్దు...."

 మ్రాన్పడిపోయాడు వాసు. కన్నార్పకుండా చూస్తూ అచేతనంగా నించున్నాడు. అతని చేతులు సుజాత భుజాల మీదనించి కిందకి జారిపోయాయి.

ఇద్దరి మధ్యా పావుగంటకాలం నిశ్శబ్దంగా గడిచింది.

వాసు అప్రయత్నంగా సుజాత భుజం మీద చెయ్యివేశాడు.

పిరికిగా చూసింది సుజాత.

మృదువుగా అన్నాడు వాసు. "నీకెందు కిష్టం లేదు?"

"ఏమో! తెలీదు...."

"నేనంటే ఇష్టంలేదా?"

"ఊహుఁ! కాదు. మీరంటే నాకెంతో ఇష్టం" కళ్ళ మెరపుతో చూసింది.

"నిజం చెప్పు సుజా! ఇంతవరకూ వచ్చిన తర్వాత దాపరికం ఎందుకు? నేనంటే నీకిష్టం లేకపోతే నిన్ను ముట్టుకోను. మిగిలిందంతా తర్వాత ఆలోచిద్దాం."

"కాదు. నిజంగా .... మీరంటే ... నాకెంతో ఇష్టం"

"మరి .... నేనంటే ఇష్టమే. నా కోరికలంటే ఇష్టం లేదు. నాకేమీ అర్థంకావడం లేదు సుజా! నేను .... ఇంకా కొన్నాళ్ళు పోయాక వస్తే బాగుండేదా?"

సుజాత మాట్లాడలేదు. భయంగా చూసింది.

వాసు ఏదో గుర్తు వచ్చినట్టు ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు. "మరి నువ్వు పెళ్ళికెందుకు ఒప్పుకున్నావు?"

"...................................."

"మాట్లాడు, నువ్వు చిన్నపిల్లవి కాదు గదా? ఇదంతా నీకు తెలీదా?"

దోషిలా అంది. "తెలుసు. పెళ్ళి చేసుకోనన్నాను. మా వాళ్ళెవ్వరూ వినలేదు. సంబంధం చూసి లగ్నం పెట్టేశారు. చచ్చిపోదామనుకున్నాను. ఏం చెయ్యాలో తెలియలేదు. నాకు ఇష్టం లేకుండానే పెళ్ళి అయిపోయింది. నిజంగా నేను తప్పు చేశాను. చచ్చిపోవలసింది. నాకు చేతకావడం లేదు."

పుక్కిటి పురాణం విన్నట్టు విన్నాడు వాసు. "నేను నీకు అన్ని ఉత్తరాలు రాశానే! ఒక్కసారైనా ఈ మాట చెప్పలేదేం?"

"................................."

"ఈ మాటలు ఉత్తరంలో చెప్పకపోయావా? నా మనసుని ఇంకో రకంగా తయారు చేసుకునేవాణ్ణి."

"..............................."

"సుజా! నువ్వు ఏదో దాస్తున్నావు. నీ మాటలు నేను నమ్మడం లేదు ..... మగవాళ్ళంటే నీకు కోపమా?"

"అదేం ప్రశ్న?" అన్నట్టు చూసింది సుజాత — "మగవాళ్ళంటే ఎందుకు కోపం?" అంది తెల్లబోతూ.

"నువ్వేమైనా కథలవీ చదువుతూ వుంటావా?"

"చదవను. చిన్నప్పుడు చదివేదాన్ని. మా అమ్మ తిట్టేది. ఇప్పుడు నాకే కథలు చదివినా నచ్చవు."

"సినిమాలు చూస్తావా?"

"భక్తి సినిమాలే చూస్తాను. ఎందుకిలా అడుగుతున్నారు?"

వాసు కొంతసేపు మాట్లాడలేదు. ఆలోచనలో మునిగిపోయాడు — "మన పెళ్ళయిన మర్నాడు నువ్వు గదిలోకి రాకూడదన్నారు. అది నిజమేనా?"

సుజాత మాట్లాడలేదు.

వాసు కోపంతో ఉడికిపోయాడు — "ఎందుకింత దారుణంగా మోసం చేశావు నన్ను? ఈ మాట ఆనాడే చెప్పవచ్చుగా? ఈ భాగ్యానికేనా ఇన్ని నెలలు ఎదురు చూసింది నేను? సంవత్సరం నించీ నన్నెందుకిలా మభ్యపెట్టావు?"

సుజాత భయంగా ప్రాధేయపడుతూ "అప్పుడు మీ గురించి నాకేమీ తెలీదు. గదిలోకి రావటానికి భయపడ్డాను" అంది.

"ఇప్పుడు?"

"మీరు మంచివారని .... స్వయంగా చెప్తే నన్ను అర్థం చేసుకుంటారని...."

"ఛీ! ఇలాంటి మంచితనమా నా మంచితనం? నిన్ను నేనే కాదు, ఎవ్వడూ అర్థం చేసుకోలేరు. నీకోసం కలలుకంటూ వస్తే, అద్భుతంగా స్వాగతం ఇచ్చావు. మంచివాడినని బిరుదు అప్పజెప్పావు. నిన్ను నేనే అర్థం చేసుకోవాలి గానీ నన్ను నువ్వు అర్థం చేసుకోకు. నా బాధ నువ్వు పంచుకోకు.... ...."

సుజాత అంది — "నేను మీకు తగను. నాకు తెలుసు. పెళ్ళికి ముందు నేనింత ధైర్యంగా ఆలోచించుకోలేదు. లేకపోతే నా తెలివితక్కువ తనంతో ఇలా చేసేదాన్ని కాదు. మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోండి. ఈ మాటే మీకు చెప్పాలనుకుంటున్నాను."

వాసుకి భరించలేనంత కోపం వచ్చింది "పెళ్ళి....! పెళ్ళంటే .... నీకు బొమ్మలాటలాగ వుంది. మనుషులంటే పశువులనుకుంటున్నావు, ఒకళ్ళని వదిలేసి ఇంకోళ్ళ వెంట పడటానికి."

ఇద్దరి మధ్యా దారుణమైన నిశ్శబ్దం!

వాసు — తనకి సడన్‌గా పిచ్చి ఎత్తకుండా వుండటానికి మనస్సుని మాలిమి చేసుకోవాలని విశ్వ ప్రయత్నం చేశాడు.

తలుపులు తీసుకుని బైటికి వెళ్ళిపోయాడు.

★ ★ ★

తెల్లారగట్ల చీకటిలోనే లేచింది జానకి.

వరండాలో కుర్చీలో కూర్చున్న మరిదిని చూసి ఆశ్చర్యపోయింది. "ఇదేమిటి! ఇక్కడ కూర్చున్నావేమిటి?" అంది తెల్లబోతూ.

"ఇక్కడ చల్లగా వుందని....."

"అబ్బా, నీ మొహంలో ఇన్నాల్టికి కళ చూశాను...."

కొంచెం నవ్వడానికి ప్రయత్నించాడు.

"ముంగిలా మాతో ఒక్కమాట మాట్లాండింది కాదు. మాటలన్నీ మూటకట్టుకొచ్చి నీకు అందించింది కాబోలు" అంది జానకి.

"అఁ మరే, తెల్లవార్లూ చెవుల్లో హోరెత్తింది" అన్నాడు కొంచెం నవ్వుతూ.

తను మళ్లీ నవ్వగలుగుతా ననుకోలేదు వాసు. కొంచెం నవ్వుతూ వదిన హాస్యానికి జవాబులు చెప్తొంటే మనస్సు కొంచెం తేలికపడింది.

ఆ పగలు ఒక్కడూ ఆలోచిస్తూ పడుకున్నాడు. పెళ్ళయిన స్నేహితులందరూ గుర్తు వచ్చారు. "మీకిలా అయిందా?" అని ఒక్కొక్కళ్ళనీ అడగాలనిపించింది. ఇలాంటి ఆడవాళ్ళ గురించి తను కొన్నిసార్లు విన్నాడు. చిన్నప్పుడు ఆడవాళ్ళ దగ్గర కూర్చుంటే, ఏవేవో కబుర్లతో పాటు ఇలాంటివి కూడా చెప్పుకుని నవ్వుకునే వారు. "కామాక్షి చూశావా, వదినా! గదిలోకి వెళ్ళమంటే ఒకటే ఏడుపట! నాలుగు కేకలేసి పంపిస్తే మొగుడి జుట్టంతా పీకి, నానా గందరగోళం చేసిందట! కంచి పట్టుచీర ముక్కలు ముక్కలు చేసేసిందట! మొగుడిక్కోపం వచ్చి చావబాదాడట. ఏం పోయే కాలం? దొబ్బుడాయా? ఈడొచ్చిన పిల్ల! సవర్తాడి నాలుగేళ్ళయింది? ఏవోఁనమ్మా! మన కాలంలో ఎరుగుదువా? పదకొండో ఏట పెద్దదాన్నయ్యాను నేను. పన్నెండో ఏట మా పెద్దవాడు కడుపున పడనే పడ్డాడు" — అలాంటి కబుర్లు బాగానే గుర్తున్నాయి వాసుకి. కామాక్షి, మొగుడి జుట్టు పీకడం ఎందుకో చిన్నప్పుడు తెలియదుగానీ, పెద్దవాడయ్యి రకరకాల పుస్తకాలు చదువుతోంటే తెలిసింది. కొంతమంది ఆడవాళ్ళలో ఇలాంటి మనస్తత్వం వుంటుందట! పెద్దవాళ్ళ ప్రవర్తనే వాళ్ళనలా తయారు చేస్తుందేమో అంటారు. భార్యాభర్తల సంబంధాలంటే, చిన్నప్పుడే అసహ్యం పుట్టుకొస్తుందేమో! ఆ మనసుల మీద నించి ఆ ముద్రలు చెరగాలన్నా, చెరపాలన్నా, యుగాలు చాలవేమో! అలాంటివి చదివాడు.

వాసుకి ఒక్కసారి నిరుత్సాహంతో కుంగిపోయినట్టనిపించింది.

సుజాత ట్రేనిండా రెండు మూడు రకాల టిఫెన్లు తెచ్చింది గదిలోకి. అన్నీ బల్ల మీద సర్దింది. చిరునవ్వుతో పిల్చింది.

వాసు లేచి తిన్నాడు.

"రాత్రి మీరు ఎక్కడ పడుకున్నారు?"

"వరండాలో కూర్చున్నాను."

"అలా వొద్దు. ఇక్కడే పడుకోండి. మీకు కోపం వచ్చిందని నాకు చాలా భయం వేసింది..."

"కోపం ... భయం...! అవి తప్ప, ఇంకేం తెలి

యవా నీకు? 'బాధ' అనేది వుంటుందని తెలుసా?"

మొహం దించేసుకుంది.

వాసు కొంచెం నవ్వు మొహంతో చూశాడు. "సరే, అలాగే, ఇక్కడే పడుకుంటాలే."

సుజాత గురించి ఎవరయినా మంచి డాక్టర్‌తో కన్సల్ట్ చేస్తే? — అనుకున్నాడు హఠాత్తుగా. కానీ .... వెంటనే ఆ అభిప్రాయం మార్చుకున్నాడు. సుజాత తత్వం కొంతవరకైనా తను ఊహించగలడు. ముందు సుజాత భయం పోగొట్టాలి. సుజాతకి తన మీద ఉత్త అభిమానం ఎంత వున్నా సరిపోదు. కాంక్ష పుట్టాలి. శరీరాన్ని వెర్రెత్తించే కోరిక పుట్టాలి. అంతవరకూ సుజాతను తను ముట్టుకోకూడదు. తప్పదు. తను భరించక చేసేదేమీ లేదు. — వాసు హృదయం తాత్కాలికంగా శాంతించినట్టయింది.

★ ★ ★

రెండో రోజు రాత్రి తొందరగా గదిలోకి వచ్చింది సుజాత.

వాసు నవ్వుతూ మామూలుగా వుండాలని ప్రయత్నించాడు.

సుజాత లేత పసుపురంగు జరీచీర కట్టుకుంది. ఆ రంగు లైటు వెలుగులో తెల్లటి తెలుపులా కన్పిస్తోంది. మొగ్గ విడీవిడని గులాబీ పువ్వు పెట్టుకుంది తలలో. క్రితం రాత్రికన్నా ఎంతో అందంగా కన్పించింది. వాసు, తనని తను హెచ్చరించుకున్నాడు. అలమారు దగ్గిరికి నడిచి పుస్తకాలు వెతకుతూ నుంచున్నాడు. ఏదో పుస్తకం తీసుకుని వెనక్కి తిరుగుతూ — "అదేమిటి? అలా నిలబడిపోయా వెందుకు? కూర్చో! ఇలారా!" అన్నాడు మంచం మీద కూర్చుంటూ.

దగ్గరికి వచ్చింది సుజాత. దూరంగా మంచం వారన కూర్చుంది.

వాసు కొంచెం నవ్వి — "ఇంకా నేనంటే భయంగా వుందా?" అన్నాడు.

సుజాత సిగ్గుపడ్డట్టు వూరుకుంది.

"రాత్రి విషయం ఎవరికైనా చెప్పావా?"

"అడిగారుగానీ చెప్పలేదు."

"ఎవరడిగారు?"

"మా అక్క అడిగింది."

"ఏమనీ?"

"ముందు ఎవరు మాట్లాడారే అంది. నేనేం చెప్పలేదు."

"ఏం?"

"నాకిష్టం లేదు. మన విషయం పై వాళ్ళకెందుకు?"

"పైవాళ్ళెవరు? మీ అక్కేగా?"

"అయితే మాత్రం?"

"మరి .... నీ విషయం ..... మీ అక్కకు తెలుసా?"

సుజాత మాట్లాళ్ళేదు. కాస్సేపటికి "నేను పెళ్ళి వద్దని ఏడవడం తెలుసు."

"ఏడిచావా?" అన్నాడు తెల్లబోతూ.

మాట్లాడలేదు సుజాత.

"అప్పుడు మీ అక్క ఏమంది?"

"దానికి ఇష్టం లేదంటోంటే ఎందుకంత బలవంతం చేస్తారు? — అని తను కూడా ఏడ్చింది.

మా అక్క చాలా మంచిదండీ! మా బావ వున్నప్పుడు చాలా సంతోషంగా వుండేది. ఇప్పుడు దానికి అంతా ఏడుపే. దాని బతుకు అలా అయింది. దాన్ని చూస్తే నాకు మంచి చీరకూడా కట్టుకోబుద్ధి వెయ్యదు. దాన్ని పూలు పెట్టుకోనివ్వరు. నన్ను పెట్టుకోమంటారు. తన నగలు కూడా నన్నే పెట్టుకోమంటుంది మా అక్క. నాకలా పెట్టుకోబుద్ధి వెయ్యదు. ..... నాకు కూడా దానిలాగే వుండాలనిపిస్తుంది."

"మీ అక్క మీద నీకు అంత ప్రేమ! ఆమెకి మళ్ళీ పెళ్ళి చెయ్యరా?"

"అమ్మో! మా అమ్మ ఒప్పుకోదు. మా మామయ్య అసలే ఒప్పుకోడు."

"మీ అక్కే చేసుకుంటాననంటే?"

"ఏమో! మా వాళ్ళు ఒప్పుకోరు. నాకు మాత్రం బలవంతంగా చేశారు. ... మిమ్మల్ని బాధపెడుతున్నాను. అదే నాకు బాధగా వుంది."

ఏదో సాలెగూడులో చిక్కుకున్నట్టనిపించింది వాసుకి. మూర్ఖులు! మూర్ఖపు కుటుంబం!

"మీరు రాత్రి కూడా నిద్రపోలేదు. పడుకోండి" అంటూ మంచం మీదనించి లేచింది సుజాత.

కొంచెం నవ్వాడు — "నిద్రకీ నాకూ ఆమడ

దూరం. ఎదురుగా నిన్ను చూస్తూ, కబుర్లు చెప్పుకోకుండా నిద్రా?"

కొంచెం మొహం ముడుచుకుంది.

గ్రహించాడు. "ఏమీ తోచడం లేదు. సినిమాకి వెళ్దామా?"

"ఇప్పుడా?"

"ఫర్వాలేదు. టైం వుంది. రెండో ఆటకి. కొంచెం కాలక్షేపంగా వుంటుంది.

"మా అమ్మా వాళ్ళు ఏమైనా అంటారేమో!"

"నేను తీసుకెళ్తోంటే ఏమంటారు?"

"సరే, పదండి."

వాళ్ళిద్దరూ సినిమాకి వెళ్తున్నారని తెలిసి జానకి విస్తుపోయింది.

వాసు నవ్వాడు.

జానకిలా సావిత్రి విస్తుపోలేదు.

★ ★ ★

మూడోరోజు బీచ్‌కి వెళ్ళారు ఇద్దరూ. సుజాత కొంచెం ఉత్సాహంగా కనపడింది.

"బి.ఏ. అయ్యాక ఏం చేద్దామనుకుంటున్నావు?" అన్నాడు.

"నేనేమీ అనుకోటం లేదు. మీరు చెప్పండి."

"నే చెప్పేది నీకు నచ్చకపోతే....?"

"ఎందుకు నచ్చదు? నచ్చుతుంది."

"ఏం చెప్పినా నచ్చుతుందా?"

సుజాత ఉత్సాహం భంగపడింది. మొహం ముడుచుకుంటూ అంది "నాకు ఒక విషయం ఇష్టం లేదని చెప్పాను. అది తప్ప ఏం చెప్పినా వింటాను."

"ఆ ఒక్క విషయమే నాకు ముఖ్యమైంది అయితే?"

"................................"

"చెప్పు మరి."

"ఏం చెప్పను? అది మీరే ఆలోచించుకోండి. నాకు ఇష్టంలేని విషయానికి నేనేం చెప్పను?"

"ఇష్టం లేకపోడానికి కారణం వుండాలి సుజా! అర్థం వుండాలి. మన ఇద్దరికీ వుండాల్సిన సంబంధాన్ని నువ్వు ఇష్టం లేదంటే నేనేమైపోతానో ఆలోచించావా?"

సుజాత చాలాసేపు మాట్లాడలేదు. చివరికి అంది. బాధనంతా కంఠంలో పోగుచేసుకుని విషాదంగా అంది. "ఇంతవరకూ నేనెంతో పవిత్రంగా వున్నాను, కానీ...."

"సుజా! నువ్వు చాలా తప్పుడభిప్రాయాలు పెట్టుకున్నావు. నిన్ను చూస్తే నిజంగా నాకు జాలేస్తోంది. అసలు 'పవిత్రత' అంటే ఏమిటి? తల్లి, బిడ్డనికంటే ఆ శరీరం అపవిత్రం అయిపోయినట్టా? పుట్టిన వాళ్ళం పుట్టినట్టు వుండిపోడానికే పుట్టామా మనం? అలా అయితే ఈ ఆకర్షణలెందుకు? ఇదంతా వ్యర్థమేనా? ఎప్పుడూ ఆలోచించలేదా నువ్వు?"

సుజాత మౌనంగా వుండిపోయింది.

వాసు అనునయంగా అన్నాడు, "ఇవ్వాళ ఈ సంబంధం నీకూ నాకూ కొత్తా? భూమి ఎప్పుడు పుట్టిందో మనకు తెలీదు. కోట్ల సంవత్సరాలైందని అంటున్నారు. అప్పట్నుంచీ కోట్ల కోట్ల జీవరాసుల మధ్య సాగుతోందీ సంబంధం. ప్రకృతి అంతా నిండి వుంది ఈ నిజం. ఇవన్నీ నోటితో చెప్పుకోవాలా? మౌనంతోనే తెలుస్తాయి ఇవన్నీ!"

సుజాత నిర్వికారంగా అంది — "ఎంత ఆలోచించినా నాకా అర్థం నచ్చటం లేదు. సంసారం త్యజించి యోగులైన వాళ్ళంతా ఎందుకయ్యారు? తుచ్ఛమైన శారీరక సుఖాల్ని మించింది ఏదో వుందని ఎందుకు చెప్తున్నారు? తపస్సులు చేసుకుంటూ బతికే వాళ్ళకి ఈ సంసారం .... ఈ సృష్టి ..... ఈ ప్రకృతి ధర్మాలూ .... ఇవన్నీ తెలియలేదా?"

వాసు విస్తుబోయాడు. సుజాతని చూస్తోంటే భయం వేసింది. ఈ అమ్మాయి కొన్నాళ్ళకి సన్యాసిని అయిపోదుగదా అనిపించింది. కొంచెం సేపు తను కూడా నిశ్శబ్దంగా కూర్చున్నాడు — "తపస్సులు చేసే వాళ్ళంతా ఎందుకు చేస్తారనుకుంటున్నావు?" అన్నాడు కొంతసేపటికి.

"ఎందుకేమిటి? భగవంతుణ్ణి చూడాలని...."

"భగవంతుణ్ణి చూడటం ఎందుకు?"

ఆశ్చర్యంగా చూసింది. "ఎందుకేమిటి? భగవంతుణ్ణి చూడగలిగితే ఎంత అదృష్టం!"

వాసుని ఒక్కసారి నిరుత్సాహం ముంచేసింది.

ఇదేమిటి? టీచరు విద్యార్థికి నేర్పినట్టు, ఈ

అమ్మాయికి ఈ బోధనలన్నీ చెయ్యాలా? అలా నేర్పి నేర్పి అప్పుడు ఆ అమ్మాయిని ముద్దు పెట్టుకోవాలా? ఆ ముద్దులో ఏం రుచి వుంటుంది? ఏం సుఖం వుంటుంది? తన భార్యకి తను బోధకుడా? తను గురువా?

"సుజా! ఇవన్నీ మాటలతో తెమిలే వ్యవహారాలు కావు. నీకు బోధించాలంటే నీ కన్నా గొప్పగా నాకు తెలిసిందేమీ లేదు. నాకు అర్థమైందేమిటంటే, ఆ భక్తీ, ఆ తపస్సులూ అవన్నీ మూఢనమ్మకాలు! మనం ఏ దేవుళ్ళ కథలు వింటామో ఆ దేవుళ్ళందరూ పెళ్ళిళ్ళు చేసుకున్నారు. పిల్లల్ని కన్నారు. రాముడూ కృష్ణుడూ బ్రహ్మచర్యాలతో గడపలేదని తెలీదా నీకు?"

సుజాత ఆశ్చర్యంగానే వింది. కానీ, ఆయన చెప్పేదంతా తనని ఒప్పించాలనే కదా? — "నేనంటే ఎంతో ప్రేమ అంటారే! నా శరీరమేనా మీకు కావలసింది?" అంది.

"ఇలా మాట్లాడడం నాకు చాలా కష్టంగా వుంది సుజా! శరీరం మాత్రమే కాదు; శరీరం కూడా! శరీరం లేకుండా నువ్వెక్కడ వున్నావు ప్రేమించటానికి?"

"నా మనస్సు మీకు అక్కర్లేదా?"

"మనస్సు శరీరంలో లేదా? ఎక్కడ వుందో చెప్పు. నీ శరీరం కేసి కన్నెత్తి చూడకుండా నీ మనసునే ఆరాధిస్తాను."

సుజాత కొంచెం నవ్వింది — "మీతో నేను మాట్లాడలేను."

వాసుకి విజయ గర్వం కలిగింది — "అసలిది ఇంత తర్కించాల్సిన విషయమా సుజా? గాలి పీల్చడం ఎంత సహజమో స్త్రీ పురుషుల సంబంధం కూడా అంత సహజం."

"కాదు, నాకు అలా కాదు."

వాసు మౌనంగా వుండిపోయాడు కొంతసేపు.

ఏదో ఆలోచన వచ్చినట్టు కొంచెం వికసించిన మొహంతో "సుజా! రేపు మనం ఎవరైనా మంచి డాక్టర్ దగ్గిరికి వెళ్దామా?" అన్నాడు.

"ఎందుకూ?" అని ఆశ్చర్యంగా చూసింది.

"ఎందుకేమిటి? మనకి ఏదైనా అనారోగ్యం వస్తే డాక్టర్లతో చెపుతాం కదా?"

"నాకేం అనారోగ్యం లేదు" అని మొహం ముడి చేసింది.

"ఆ సంగతి డాక్టరే చెప్పాలి. కొన్నిసార్లు మన జబ్బులు మనకి తెలీవు."

"జబ్బు అనకండి. ... మీకు మొదటే చెప్ప వలిసింది. మా అమ్మ చచ్చిపోతానని ఏడిస్తే భయం వేసి పెళ్ళికి ఒప్పేసుకున్నాను. చాలా తప్పు చేశాను. మీ గురించి ఆలోచించలేదు."

"సరే, జరిగిపోయిందాన్ని గురించి ఇప్పుడేం చేస్తాం? ఒక్కసారి డాక్టరు దగ్గిరికి వెళ్దామంటున్నాను కదా?"

"ఛీ! వాళ్ళు పరీక్షలు చేస్తారు. నాకు ఇష్టం వుండదు. మిమ్మల్ని మళ్ళీ పెళ్ళి చేసుకోమని చెప్పాను కదా?"

"చెప్పావు! నేనెలా నడవాలో నాకు తెలుసు. ఇతర్లు చెప్పినట్టు నడవడం నా పద్ధతి కాదు."

సుజాత జవాబు ఇవ్వకుండా ఊరుకుంది.

వాసు పుట్టెడు నిరుత్సాహంలో కూరుకుపోయాడు.

★ ★ ★

**వా**సు తమ ఊరు వెళ్ళాక, ఒక్కడే వెళ్ళాడు డాక్టర్ దగ్గిరికి. అంతా చెప్పాడు. మొట్టమొదటే "ఆమె రాదు" అని చెప్పేశాడు.

డాక్టరు విన్నాడు అంతా. "అక్క జీవితం అలా అవడం వల్ల ఈ అమ్మాయికి విరక్తి వచ్చివుండొచ్చు. తల్లి పెత్తనంవల్ల భక్తి పిచ్చిలో పడినట్టుంది. ఏది ఏమైనా, మీరు చాలా ఓపిక పట్టాలి" అన్నాడు.

"మీ అనుభవంలో ఇలాంటి కేసులు చూశా రాండీ?" అని అడిగాడు వాసు ఆతృతగా.

"ఉన్నాయి. కానీ కొంచెం అరుదు."

"వాళ్ళు మారారా?"

"కొందరు మారారు. కొందరు మారలేదు."

"మరి... మారకపోతే... ఆ మొగవాళ్ళు...."

"డోంట్ వర్రీ! అదంతా ఆలోచించకండి .... ఆమెకి ఉత్తరాలు రాస్తూ వుంటారా మీరు?"

"రాస్తున్నాను........"

"నెమ్మదిగా ఈ విషయాలు కూడా ప్రస్తావిస్తూ వుండండి....."

వాసు సిగ్గుపడుతూ "రాయకుండా వుండలేక రాస్తున్నాను. కానీ అలాంటి ఉత్తరాలకి జవాబులే

ఇవ్వదు."

డాక్టరు చిరునవ్వుతో "వెయిట్ సమ్ మోర్ టైమ్" అన్నాడు.

వాసు, డాక్టర్‌కి నమస్కారం పెట్టి సెలవు తీసుకున్నాడు.

నిరీక్షించాలట ఇంకా ఇంకా!

నిరీక్షించక చేసేదేముంది?

★ ★ ★

సుజాత అత్తారింటికి రావడమా, ఎం.ఏ.లో చేరడమా అన్నది, భార్యాభర్తలు తేల్చుకోలేదు.

వాసు తల్లి, కోడల్ని తొందరగా తీసుకు రావాలని ఆరాట పడుతోంది.

ఒక్క నెలరోజులు జరగనిచ్చి కొడుకు దగ్గిర పాట మొదలు పెట్టింది — "పెళ్ళయి సంవత్సరం దాటింది. ఇదేం చోద్యంరా? ఇలా పెళ్ళయిన వాళ్ళు అలా చెట్టాపట్టా లేసుకుని తిరుగుతున్నారు. ఆ చదువేదో ఇక్కడ చదువుకో కూడదా? అమ్మాయిని తీసుకు రావాలంటే వద్దంటావేమిటి? కోడలొచ్చి నాకేమీ చాకిరీ చెయ్యక్కర్లేదులే. మీరిద్దరూ సుఖంగా వుండండి, అదే పది వేలు" అంటూ సాధించటం మొదలు పెట్టింది.

ఆవిడ మాటలు వినగా వినగా వాసుకో సందేహం ప్రారంభమైంది. తమ రహస్యం వదిన పసికట్టేసిందేమో, అమ్మకి చెప్పేసిందేమో, అందుకే అమ్మ కోడల్ని తీసుకు రావాలని అంత పట్టుబడుతోందేమో అని. తన గురించి ఇంట్లో వాళ్ళంతా జాలిపడుతున్నారంటే భరించలేకపోయాడు వాసు. ఆ రాత్రికే అత్తగారి వూరు ప్రయాణం పెట్టుకున్నాడు, సుజాత వస్తానంటుందో లేదో అడగాలని.

★ ★ ★

సుజాత ఎమ్.ఏ.లో చేరతానంది. వాసు కూడా ఒప్పుకున్నాడు. సంసారమూ లేక, చదువూ లేక, సోమరిగా ఉండడం వాసుకి నచ్చలేదు.

వాసు అప్పుడప్పుడూ వెళ్తూనే వున్నాడు అత్త గారింటికి. ఎప్పుడు వెళ్ళినా సుజాతా వాసూ సినిమాలకి వెళ్తారు. బీచ్‌లో కూర్చుంటారు. ఎక్కడికో అక్కడికి వెళ్ళి వస్తారు.

వాసు వున్నన్ని రోజులూ అతనికి సదుపాయాలన్నీ సావిత్రే చేయిస్తుంది. అతనికేదీ లోటు జరగకుండా ఏర్పాటు చేస్తుంది. ఫలహారాలూ భోజనాలూ గౌరవాలూ అన్నీ జరుగుతాయి రోజంతా.

అతన్ని ఇంట్లో అందరూ అభిమానంగా చూస్తారు — పిల్ల గురించి గొడవలు చెయ్యకుండా వున్నాడని.

వాసు, సావిత్రిని, అనుకోకుండా ఒకసారి చాలా దగ్గిరిగా చూశాడు. వాసు డాబా మీదికి వెళ్ళాలని మెట్ల మీదికి వెళ్ళాడు. సావిత్రి పైనించి దిగబోతూ సగంలో ఆగిపోయింది. ఇద్దరూ చాలా దగ్గరగా అయ్యారు. ఇద్దరూ కంగారుపడ్డారు. వాసు తప్పుకున్నాడు. సావిత్రి వెళ్ళిపోయింది. వెళ్ళిపోతున్న సావిత్రిని వాసు అలాగే చూస్తూ నుంచున్నాడు. తల స్నానం చేసి గాలికోసం కాస్సేపు పైకి వెళ్ళింది సావిత్రి. లేత నీలంరంగు చీర కట్టుకుంది. చేతులకు బంగారపు గాజులు వున్నాయి. జడ వదులుగా అల్లుకుంది. మెడలో సన్నటి గొలుసు వుంది. బొట్టూ, పువ్వులూ లేవు తెలియని వాళ్ళు సావిత్రిని చూస్తే పెళ్ళి కానిదనుకుంటారు. మనిషి నాజూగ్గా వుంటుంది. వినయంగా పొందికగా వుంటుంది.

వాసు, సావిత్రి శరీర సోయగాలు చూడలేదు. సావిత్రి కళ్ళల్లోకి చూశాడు అప్రయత్నంగా. విస్మయంతో, తన్మయత్వంతో, మ్రాన్పడిపోయాడు. నును సిగ్గుతో ఆరాధనతో .... అనురాగంతో .... ఉక్కిరి బిక్కిరయ్యాయి సావిత్రి చూపులు. తను కోరుకునే లాంటి స్త్రీత్వం మూర్తీభవించిన చూపులు అవి! వాసు అచేతనంగా వున్న స్థితిలో సావిత్రి గబగబా వెళ్ళిపోయింది.

తర్వాత కూడా రెండు మూడు సార్లు సావిత్రిని చూశాడు వాసు. సావిత్రి చేష్టల్లోనూ.... కదలికల్లోనూ... దూరం నించి వినపడే మాటల్లోనూ, ఏదో మంచితనం, ఏదో సహజత్వం, చూశాడు. "స్త్రీ ఇలా వుండాలి, ఇలా వుండాలి" అనుకున్నాడు.

వాసు ఊహల్లోంచి సుజాత మాయమై సావిత్రి ప్రవేశించడం వాసుకి కూడా తెలీదు. వాసు ఊహలు అప్రయత్నంగా సావిత్రిని ముట్టడించినప్పుడల్లా వాసు చాలా నొచ్చుకున్నాడు. చాలా భయపడ్డాడు. తనని తను తిట్టుకున్నాడు. హెచ్చరించుకున్నాడు. కానీ ప్రతీసారీ ఓడిపోయాడు.

వాసుకి ఒక విషయానికి పశ్చాత్తాపం మొదలైంది. అసలు తన విషయం అంతా వదినకు చెప్పెయ్యా నందుకు.

"సుజాత ఇలా అంది. నన్ను మళ్ళీ పెళ్ళిచేసు కోమంది. పెద్దవాళ్ళంతా ఏం ఆలోచిస్తారో ఆలో చించండి" అని వ్యవహారం పది మందిలో పడెయ్యా ల్సింది. తనకీ రంపపుకోత తప్పేది. కానీ .... సంవ త్సరం నించి ఎదురుచూసి .... ఎదురుచూసి .... అంత నిరభిమానంగా మనసు విరుచుకోలేక పోయాడు. 'నేను ముట్టుకోడం నీకు ఇష్టం లేదు కదా? సరే, ఇంకో పెళ్ళి చేసేసుకుంటా!' అనెయ్యలేకపోయాడు. శాశ్విత బంధం అనుకున్న దానికి ఒక్క పూటతో విలువ లేకుండా చేసుకోలేక పోయాడు. కష్టమో నిష్టూరమో భరించాలనుకున్నాడు. తన తప్పేముంది? ఏమీ లేదు. కానీ, ఎంత కాలం? ఇప్పుడు ఆ మనిషి మారితే మాత్రం ఏం సంతోషం? ఎవరిక్కావాలి?

సుజాత కోసం నిరీక్షించడంలో మాధుర్యం సన్న గిల్లిపోయింది. కానీ, తనని తను మభ్య పెట్టుకుంటూ వస్తున్నాడు. సుజాత మారుతుంది. తప్పకుండా మారు తుంది. ఆ తర్వాత తను జీవితం సుఖంగా, శాంతిగా, హాయిగా సాగుతుంది. ఆ నమ్మకంతో రోజులు దొర్లిస్తున్నాడు.

★ ★ ★

వాసు అత్తవారింటికి వచ్చి రెండు రోజులైంది. వాసు మనసు వాసు చేష్టల్ని పరిహసించటం మొదలు పెట్టింది. "నువ్వు వచ్చింది సుజాత కోసం కాదు, సావిత్రి కోసం" అంది మనసు వెటకారంగా.

"కాదు, కాదు" అనడం తప్ప అంతకన్నా గట్టిగా జవాబు చెప్పకోలేకపోయాడు.

ఆ రోజు పొద్దుట్నించీ ఆకాశం మబ్బుపట్టే వుంది. పగలంతా వాసూ సుజాతా కాస్సేపు పుస్తకాల తోటి, కాస్సేపు కేరమ్స్ తోటీ గడిపారు.

దీపాలు పెట్టే వేళనించీ సన్న సన్న చినుకులతో ప్రారంభమైంది వర్షం. చూస్తోండగా హోరుమంటూ కుంభవృష్టిలోకి దిగింది. వాసు, వర్షం చూస్తూ కిటికీ దగ్గర నించున్నాడు. వర్షం ఏకధారగా అవిరామంగా కురుస్తోంది.

వాసు మొహం, చేతులూ, చొక్కా అన్నీ తడిశాయి వర్షపు జల్లుల్తో.

"అదేమిటి? అలా తడుస్తూ నించున్నారు" అంది సుజాత లోపలికొస్తూ. "వర్షం గదిలో కొస్తోంది. కిటికీ వేసెయ్యండి. బట్టలు మార్చుకోండి" అంది పక్కన నించుంటూ.

"ఫర్వాలేదు. గదిలో నీళ్ళు తుడిచేస్తే పోతాయి. వానకురవటం చూస్తోంటే ఎంత బాగుందో చూడు" అక్కణ్ణుంచి కదల్లేదు వాసు.

వాసుకి అందంగా కనిపించని దృశ్యం ఏదైనా వుంటుందో లేదో సుజాతకి అర్థం కాలేదు.

"వెన్నెలెంత బాగుందో చూడు" అంటాడు.

"ఈ మందారం పువ్వు బాగుంది కదూ?" అంటాడు. ఆఖరికి పచ్చగడ్డి కూడా నచ్చుతుంది అతనికి!

సుజాత మనసుకి ఏ అందమూ అర్థం కాదు. వర్షం కురుస్తోంటే పుట్టెడు దిగులు ముంచుకొస్తుంది. లోకమంతా ఏదో విపత్తులో మునిగిపోతున్నట్టు అని పిస్తుంది.

"తడి బట్టలతో జలుబు చేస్తుంది. ముందు బట్టలు మార్చుకోండి. పదండి, భోంచేద్దాం" అంది సుజాత.

"నాకేం బాగాలేదు సుజా! నువ్వెళ్ళి భోంచేసిరా!"

"ఏం? ఏం బాగాలేదు?"

"ఏమో! అన్నం తినాలని లేదు. నువ్వెళ్ళు. నిజంగా నాకు ఆకలిగా లేదు."

"పోనీ కొంచెం పాలు తీసుకురానా?"

"నా మాట విను. ఇవ్వాల్టి కేమీ వద్దు. నువ్వెళ్ళి భోంచేసిరా!"

సుజాత నెమ్మదిగా వెళ్ళిపోయింది.

కొంతసేపటికి పని కుర్రాడు వెండిగ్లాసు నిండా పాలు తీసుకు వచ్చాడు.

"అక్కర్లేదని చెప్పానే! తీసికెళ్ళు" అన్నాడు వాసు చిరాగ్గా.

"పెద్దమ్మాయిగారు పంపించారండీ! తీసుకోమని చెప్పమన్నారండీ!"

వాసు ఆశ్చర్యపోతూ — "బల్లమీద పెట్టు" అన్నాడు.

కుర్రాడు వెళ్ళిపోయాడు.

వాసు లేచి చప్పున గ్లాసు తీసుకున్నాడు.

యాలకుల పొడి వేసిన పాలు! ఘుమఘుమ పరిమళిస్తూ తియ్యగా మధురంగా వున్నాయి. సావిత్రి ఈ పాలనిండా తన అనురాగం రంగరించి పంపిం దేమో! ఎందుకింత దయ తనంటే?

తడి బట్టలతో పాలు తాగుతూ కూర్చున్నాడు.

సుజాత లోపలికి వచ్చింది. రేడియో పెట్టి ఏదో క్లాసు పుస్తకం తీసుకుంది.

పాట సగంలోంచి వస్తోంది.

"శృతి లేని నా మదికి
చతుర గీతా లేల?
గణి రాని పాదాల
గతుల నృత్యంబటే?
పాడకే నా రాణి
పాడకే పాట
పాట మాధుర్యాల
ప్రాణాలు మరిగెనే!
పా.... డ.... కే!"

వాసు కుర్చీలో వెనక్కివాలి పాట వింటూ కళ్ళు మూసుకున్నాడు. విషాదం గుండెల్ని బరువెక్కించింది. అర్థంకాని దుఃఖంతో వాసు ప్రాణాలు తల్లడిల్లాయి. శరీరం కంపించసాగింది.

పాట వెనక పాట వస్తోంది. అన్నీ విషాద గీతాలే!

సుజాత క్లాసు పుస్తకంలో లీనమైంది.

ఇద్దరి మధ్యా గంటలకు గంటలు నిశ్శబ్దంగా దొర్లిపోయాయి.

సుజాత హఠాత్తుగా లేచి టైం చూసింది పద కొండు దాటింది. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. లేచి లైటార్పి డిమ్‌గా వెలిగే లైటు వేసింది. వాసు దగ్గిరికి వెళ్ళి — "చాలా రాత్రయింది, లేచి మంచం మీద పడుకోండి" అంది.

వాసు తలెత్తి సుజాతని చూశాడు. ఎప్పుడూ లేనంత మత్తుగా చూశాడు. సుజా చెయ్యి అందుకుని దగ్గిరికి లాక్కున్నాడు. "సుజా! ఈ రాత్రి .... ఎంత బాగుంది!...."

సుజాత తెల్లబోయింది. వాసు ఎప్పుడూ అలా చెయ్యలేదు. అతన్ని అలా చూడలేదు. తమాయించు కుంటూ అంది "లేవండి. తడి బట్టలతో ఇంతసేపు వుంటే జబ్బు చెయ్యదా?"

"చెయ్యనీ! జబ్బు చేస్తే చచ్చిపోతారు, అంతే కదా? అంతకన్నా అదృష్టం ఏముంది?" వాసు లేచి నించున్నాడు. "సుజా! ఈ వర్షం చూడు! ఆకాశం కన్నా ఘోరంగా ఏడుస్తోంది నా హృదయం. నిన్ను ముద్దు పెట్టుకోకుండా, నిన్ను కౌగిలించుకోకుండా ఎంత కాలం వుండగలను చెప్పు?"

సుజాత తెల్లబోయి చూసింది — "మీరే చెప్పండి. ఇలా మనం స్నేహితుల్లా వుండలేమా?"

"స్నేహితుల్లా! .... ఇలా దూరదూరంగా .... స్నేహి తుల్లా!...." విస్తుపోయి నవ్వాడు వాసు — "ఒక స్త్రీ, ఒక పురుషుడూ ఇంత సన్నిహితంగా స్నేహం చేస్తే, వాళ్ళు తప్పకుండా ఒకరి కౌగిట్లోకి ఒకరు చేరిపోతారు. సుజా! మనం ఉత్త స్నేహితుల్లా వుంటే .... ఎంత కోల్పోతామో మనకేం తెలుసు? మన మధ్య స్నేహం చాలదు సుజా, సహచర్యం వుండాలి. గాఢంగా కౌగి లించుకోవడం వుండాలి. తనివితీరా ముద్దులు వుండాలి. అప్పటికిగానీ, మనకు శాంతి వుండదు. ఈ మూగబతుకులు ఎన్నాళ్ళు? సుజా! ఇదే మనకు మొదటి రాత్రి అనుకుందాం. ఇలాంటి రాత్రులెన్ని వ్యర్థం చేసుకున్నాం!" వాసు శరీరం ఆపాదమస్తకం కంపిస్తోంటే, సుజాతని గాఢంగా హత్తుకుని చేతు లతో బంధించి వేశాడు.

"ఛీ! ఏమిటిది? వదలండి! మీరు చాలా మంచి వారనుకున్నాను. ఏమిటీ బలవంతం?" — ఏడుపు మొహంతో పట్టువదిలించుకోవాలని పెనుగులాడింది సుజాత.

"సుజా! నేను మంచివాణ్ణే, దుర్మార్గుణ్ణి కాను. నన్ను దూరంగా వుంచకు!..." వాసు చేతులు ఆమెని ఇంకా బలంగా పెనవేసుకున్నాయి. సుజాత చెంప లకు గాడుపులాంటి నిట్టూర్పు తగిలింది.

సుజాత శరీరం చీదరతో జలదరించింది.

వాసు తనువు పులకరిస్తోంది.

సుజాత మనసు కుంచించుకుపోయింది.

వాసు హృదయం నాట్యం చేస్తోంది.

"అబ్బా!" — బాధతో విలవిలాడుతూ పట్టువది లేశాడు వాసు.

చేతిమీద మునిపళ్ళు దిగిపోయిన గుర్తులు! బొటబొటా రక్తపు చుక్కలు నేలమీద పడుతున్నాయి.

వాసు రెండో చేతితో గాయాన్ని అదిమి పట్టుకుని తూలుతూ గది బయటికి వెళ్ళిపోయాడు.

సుజాత కుప్పలా కూలిపోయింది. భోరున ఏడవటం మొదలుపెట్టింది.

వాసు వరండాలోకి వెళ్ళి నీళ్ళకోసం చుట్టూ చూశాడు. సావిత్రి గదిలో లైటు వెలుగుతోంది. వెలుగు వరండాలోకి పడుతోంది. సావిత్రి వాసుని చూసి చాలా కంగారుపడింది.

"ఏమండీ, మీకేమైనా కావాలా?.... సుజాని పిలవనా?"

"సుజా ఇచ్చిన బహుమానం చూడండి!" వాసు సావిత్రి మొహం మీదకి చెయ్యి చాపాడు. రక్తంతో తడిసి మోచేతి దగ్గిర్నుంచీ అరిచేతి వరకూ భయంకరంగా కన్పించింది.

"అయ్యయ్యో! ఏమిటిది? ఏమయింది?" ఏం చెయ్యాలో తెలీక సావిత్రి వెర్రిదానిలా ఇటూ అటూ చూసింది కంగారు పడిపోతూ.

"కొంచెం నీళ్ళుంటే ఇవ్వండి" అన్నాడు వాసు.

సావిత్రి గదిలోకి పరిగెత్తి కూజా తెచ్చింది. వరండా చివర వాసు చేతులమీద నీళ్ళు పోసింది. కూజా కిందపెట్టి మళ్ళీ గదిలోకి పరుగెత్తింది. మెత్తని గుడ్డ తీసుకొచ్చింది. వెడల్పుగా మడతపెట్టి ఒత్తుగా కట్టు కట్టింది.

"చాలా బాధగా వుందా?"

"బాధగానే వుంది."

"అయ్యో! వెంటనే ఇంజక్షన్ చెయ్యాలేమో!"

సావిత్రి మనస్సంతా వాసు మీద ఎన్నాళ్ళనించో పేరుకుంటోన్న జాలితో, సానుభూతితో, అనురాగంతో, పొంగి పొర్లింది. "ఎందుకిలా చేసింది? ఇంత దుర్మార్గంగానా?"

వాసు సావిత్రి మొహంలోకి చూస్తూ "మీ చెల్లెలి గురించి మీకేమీ తెలీదా?" అన్నాడు.

సావిత్రి దోషిలా అంది "ఎందుకు తెలీదండీ? తెలుసు. మాకందరికీ తెలుసు". కాసేపు మౌనంగా వూరుకుంది. తర్వాత గబగబా చెప్పింది — "మా వాళ్ళు మొదట్లోనే చాలా పొరపాటు చేశారు. అది పెళ్ళి వద్దని తెగ ఏడ్చింది. పెళ్ళయితే అదే మారుతుందనుకున్నారు. తీరా ఆ మొదటినాడు గదిలోకి వెళ్ళనని ఏడుస్తూ కూర్చుంది. ఏం చెయ్యాలో తోచక అలా వంక పెట్టారు. తర్వాత కూడా అది ఒప్పుకోలేదు. జ్వరం వస్తోందని మీకు ఉత్తరం రాశారు. తర్వాతంతా మీకూ తెలుసు. మీరు రాసిన ఉత్తరాలు చదవటం కూడా దానికి ఇష్టం వుండేది కాదు. అది మొదటి నుంచీ ఏమిటోలా వుండేది. మా తాతగారు పడుచుతనంలోనే సన్యాసుల్లో కలిసిపోయారట! ఆ తత్వం దీనికి వచ్చిందేమోనని మా వాళ్ళంతా బెంగపడుతున్నారు. తొందరపడి పెళ్ళి చేశామని ఇప్పుడు చాలా పశ్చాత్తాపాలు పడుతున్నారు. కానీ .... మీరు చాలా ఓపిక వంతులనీ, దాన్ని నెమ్మదిగా మార్చుకుంటారనీ...." ఆగిపోయింది.

వాసు విరక్తిగా నవ్వాడు — "అవును, నేను చాలా ఓపికమంతుణ్ణి! నాకొచ్చిన కీర్తి ఇదీ! మీరందరూ నన్ను కొంతకాలం దాకా దగా చేశారు. నాకు నిజం తెలిసినప్పుడైనా నేను ఇందులో నించి తప్పుకోవలసింది. 'ఓపిక పట్టాలి, తొందరపడకూడదు' అని నేనూ పొరపాటుగా ఆలోచించాను....."

"అయ్యో, అలా అనకండి! దాని అదృష్టంకొద్దీ మీరు దొరికారు. చిన్నపిల్ల. మీరే కాదంటే అదేమైపోతుంది? మీ మంచితనంతో అది తప్పకుండా మారుతుందండీ....."

"మారుతుంది! పదేళ్ళకి! అప్పటికి నేను చచ్చిపోయి పదేళ్ళవుతుంది. ఇంకా ఎందుకు మభ్యపెడతారు నన్ను? ఆమె జీవితం ఆమె ఇష్టం. ఆమెని మార్చడానికి మనం ఎవరం? ఆమె అలాగే వుంటానని చెపుతోంటే వుండనివ్వాలి! ఇంత చిన్న విషయం అర్థంకావడానికి ఇంతకాలం పట్టింది నాకు!"

"మీరలా అంటే నేనేం చెప్పను?"

"ఏమీ చెప్పొద్దు సావిత్రిగారూ!" వాసు సావిత్రి మొహంలోకి గుచ్చి గుచ్చి చూశాడు "మిమ్మల్ని నేనో మాట అడగనా?"

"నన్నా? అయ్యో, అడగండి."

"మీకు నేనంటే ఇష్టమేనా?"

తడబడింది సావిత్రి — "అదేమిటి? మీరంటే నాకెందుకు ఇష్టం వుండదూ?"

"అది కాదు. మీ మరిదినని కాదు."

"మరిదని కాకపోయినా.... మీరంటే నాకు చాలా

గౌరవం. మంచి మనిషంటే ఎవరికి గౌరవం వుండదు?"

"సావిత్రిగారూ!" వాసు సావిత్రి చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు — "మీలాంటి స్త్రీ కావాలి నా జీవితానికి. ఆవేశంగా మాట్లాడుతున్నాననుకోకండి. ఇంత వరకూ సుజాతతో సంబంధం లేదు నాకు. నేను ఇంకో పెళ్ళి చేసుకుంటే ఆమె బాధ పడదు. మనం పెళ్ళి చేసుకుందాం. మా వాళ్ళు ఇష్టపడకపోతే నేను వేరే కాపరం పెడతాను. మనం వెళ్ళిపోదాం రండి! ఒక్క క్షణం కూడా ఈ ఇంట్లో వుండను. నాతో తీసుకు పోతాను రండి!" వాసు సావిత్రి రెండు చేతులూ పట్టుకున్నాడు.

సావిత్రి మాన్పడిపోయింది. మాటరాని దానిలాగా అయిపోయింది.

"సావిత్రీ! చెప్పండి! ఒక్క మాట చెప్పండి!"

"..... వదిన తల్లిలాంటిది అంటారు. మీరడిగేది ఎంత పాపం!"

"ఆ వరసలు నాకూ తెలుసు. కానీ, సుజాత నాకు భార్యకానే కాదు. ఆ నిజం మీకూ తెలుసు. మీరు నాకు 'వదిన' ఎలా అవుతారు?"

"అలా అంటే ఎలాగ? మూడు ముళ్ళూ పడ్డ తర్వాత ఆమె మీకు భార్య కాదంటే ఎలాగ?"

"అయ్యో! మీకెలా చెప్పను?"

"నేను ఒప్పుకున్నా మా వాళ్ళు ఒప్పుకుంటారనుకుంటున్నారా? నేను నిజంగా అలా చేస్తే మా అమ్మ నూతిలో పడిపోతుంది."

"పడిపోనివ్వండి! అలాంటి వాళ్ళు పిల్లలకు తల్లులు కారు, శత్రువులే! పిల్లల ఇష్టాయిష్టాలు ఆలోచించకపోతే ఆ తల్లులేం తల్లులు? వాళ్ళ మాట ప్రకారం మీరెందుకు నడవాలి?"

"మా అమ్మ ఇప్పటికే నామీద అనుమానపడుతోంది, మీ గురించి"

"నా గురించా? ఎందుకూ?"

"నేను మీ భోజనాల విషయంలో కొంచెం పట్టించుకుంటానని నాకేదో దురుద్దేశం వుందనుకుంటోంది. నేను సుజాత సంసారాన్ని ఇంకా పాడు చేస్తానేమోనని మా అమ్మ భయం! నేను ఏ మొగాళ్ళతో మాట్లాడినా మా అమ్మకి భయమే."

వాసు తెల్లబోతూ విన్నాడు — "ఇలాంటి నరకంతో ఇంకేం పని మీకు? నాతో వచ్చెయ్యండి! నా మీద నమ్మకం కలగడం లేదా?"

సావిత్రి కళ్ళు తడితో తళతళలాడాయి.

"అలా అనకండి! నాకు మీ మీద ఎంతో పూజ్య భావం! కానీ.... నేను నా భర్తతో ఎంత సంతోషంగా వున్నానో తెలిస్తే మీరు నన్నిలా అడగరు. ఆయన జ్ఞాపకాలు నా మనసులో నించి ఎప్పుడూ పోలేదు."

"పోవడం ఎందుకు? ఆ జ్ఞాపకాలన్నీ అలా ఉండనివ్వండి!"

"నా మనసునిండా ఆయనే వుంటే, ఆ మనసులో ఇంకో మనిషికి చోటెలా వుంటుంది?"

వాసు నెమ్మదిగా సావిత్రి చేతులు వదిలేశాడు. "ఎంత అదృష్టవంతుడు ఆయన! నేను మీ మనసు తెలుసుకోలేదు. నన్ను అపార్థం చేసుకోకండి!"

"అయ్యో! మీరు అంత చెప్పాలా? మీలాంటి మనిషిని అపార్థం చేసుకుంటానా? దిగులు పడకండి! మీ జీవితం తప్పకుండా బాగుపడుతుంది. మీకు మంచి పిల్ల దొరుకుతుంది. జీవితం నూరేళ్ళ పంట అంటారు. కావలసినంత జీవితం వుంది మీకు......"

ఆమె మాటలు శ్రద్ధగా విన్నాడు. ఆమెని కృతజ్ఞతగా చూశాడు.

"సావిత్రీ!" — ఇంట్లోంచి తల్లి పిలుపు కర్కశంగా వినిపించింది.

సావిత్రి తడబడుతూ వెళ్ళిపోయింది.

సావిత్రిని తల్లి చీవాట్లు పెట్టడం వింటూ నించున్నాడు వాసు.

"ఇదేం పొయ్యే కాలమే నీకు? ..... అది మొగుడితో కాపరం చెయ్యటంలేదెలాగరా భగవంతుడా — అని ఏడుస్తోంటే నీకిదేం బుద్ధి? అతనితో గుసగుసలేమిటి? — ఇంటా వంటా లేని దరిద్రులు బయల్దేరారు. తలెత్తుకోటానికి నాకిక దారిలేదు తల్లీ! ఏనుయ్యో .... గొయ్యో .... చూచుకోవాలి నేను...."

సావిత్రి వెక్కివెక్కి ఏడుస్తోంది — మధ్య మధ్య నెమ్మదిగా నచ్చచెప్పాలని ప్రయత్నిస్తోంది — "అమ్మా! .... ఆయన చేతిమీద సుజాత పళ్ళతో కొరికింది. రక్తం కారిపోతుంటే, నీళ్ళడిగితే ఇచ్చాను — నాకు మాత్రం తెలీదా? అన్యాయంగా నన్నెందుకంటావు?"

వాసు గబగబా అటువేపు వెళ్ళాడు. గుమ్మంలో నిలబడ్డ అల్లుణ్ణి చూసి తెల్లబోయింది అత్తగారు.

వాసు తీక్షణంగా అన్నాడు — "అనవసరంగా ఆవిణ్ణి అనకండి! మీ పరువు ప్రతిష్ఠలు అవిడేమీ పాడు చెయ్యలేదు. మీలాంటి గొప్ప వారు ఉండగా మీ పరువు ప్రతిష్ఠలకేం లోటు? నాశనం అయితే నేను అవుతాను. మీ కుటుంబం గౌరవం ముందు ఒక మనిషి జీవితం ఎంత? — గడ్డిపరక!" — గిర్రున వెనక్కి తిరిగి గదిలోకి వెళ్ళిపోయాడు.

సుజాత గుమ్మానికి కరచుకుని బిక్క మొహంతో నిలబడి వుంది.

వాసు గబగబా బట్టలు సర్దుకున్నాడు. సూట్‌కేసు చేతిలోకి తీసుకున్నాడు.

సుజాత వెర్రిదానిలా వచ్చి వాసు పాదాలమీద పడింది. వెక్కివెక్కి ఏడుస్తూ కాళ్ళు రెండూ చుట్టేసింది — "మీరు వెళ్ళిపోవద్దు. నా తప్పులన్నీ మర్చిపోండి. మీ ఇష్టప్రకారం వుంటాను. మిమ్మల్ని బాధపెట్టను. నన్ను నమ్మండి. మీరు వెళ్ళిపోవద్దు — నన్ను క్షమించండి" అంటూ ఏడ్చింది.

వాసు శాంతంగానే అన్నాడు — "సుజాతా! నేను కోరింది నీ శరీరాన్ని కాదు. నీ మనసునే. అందులో నాకు చోటు దొరకలేదు. నిన్న మొన్నటిదాకా నా మనసులో నువ్వు వున్నావు. ఇప్పుడు లేవు. ఒకరి మీద ఒకరికి మనసు లేనప్పుడు..... ఒకరికి ఒకరం ఏమీ కాలేము .... కలిసి ఎలా బతుకుతాము? నా కోసం నీ శరీరం అప్పచెపుతానంటే నేను సంతోషిస్తాననుకున్నావా? నేను పశువునా? నా తప్పులేమైనా వుంటే నువ్వే క్షమించు! నీకిష్టమైనట్టే నువ్వు జీవించు! నిన్ను మార్చాలని నేనెందుకు ప్రయత్నించాలి? నీ మనస్తత్వం నువ్వు చెప్పావు. దాన్ని అర్థం చేసుకుని నా మార్గం నేను ఏర్పర్చుకోవాలి. నిన్ను మార్చడానికో, దిద్దడానికో నేనెవణ్ణి? నిన్ను ముట్టుకోవద్దని చెప్పావు. అది అర్థం చేసుకోకుండా నేను అంత మొరటుగా ఎందుకు ప్రవర్తించాలి? నీ మీద మీ పెద్ద వాళ్ళు పెత్తనం చేసినట్టే నేనూ చేశాను. నిన్ను మార్చాలని వాళ్ళు ప్రయత్నించినట్టే నేనూ ప్రయత్నించాను. నన్ను క్షమించు సుజాతా! ఇదంతా నాకు అర్థం కాలేదు. నేను వెళ్ళిపోవడం నీమీద కోపంతో కాదు. మనం కలిసి బతకడం కుదరదు. విడిపోక తప్పదు." సుజాత చేతులు వదిలించుకుని ముందుకు నడిచాడు. హోరున కురుస్తోన్న వానలో ఆ రాత్రి!

[1967 దీపావళి 'యువ' మాసపత్రికలో] ★

## ఈ కథ గురించి:

ఈ కథ రాసినప్పుడు దీని పేరు — 'శోభనం రాత్రి.' ఆ పేరుని ఇప్పుడు 'ఆ రాత్రి' అని మార్చాను. ఎందుకంటే, 'కార్యం..... శోభనం ... కన్నెరికం...'లాంటి మాటల్ని, తప్పనిసరిగా చెప్పవలసిన సందర్భాల్లో తప్ప, మిగతా సందర్భాల్లో వాడకూడదు. మొదట్లో ఆ పేరు ఎందుకు పెట్టానా — అని ఆలోచిస్తే, 'జ్ఞానంలేక' అనే జవాబు తప్ప ఇంకే జవాబూ రావడంలేదు. ఒక పాఠకుడు, ఒక పాఠకురాలితో — "'ఆ రాత్రి' కథ చదివారా?" అనడానికీ, "'శోభనం రాత్రి' కథ చదివారా?" అనడానికీ తేడా వుందా, లేదా? 'శోభనం రాత్రి' అనే మాట, నలుగురి మధ్యా మాట్లాడుకోడానికి బాగుండదు. అందుకే ఆ పేరు మార్చాను.

ఈ కథ రాసినప్పుడు, దీని ముగింపు కొంచెం తేడాగా వుండేది. వాసు, సుజాతని వదిలేసి వెళ్ళిపోడం, ఆమె ప్రవర్తనకి కొంచెం శిక్ష అయినట్టు అర్థం వచ్చేలాగ! ఆమె చేసిన తప్పు, పెళ్ళికి ముందుగానీ, తర్వాతగానీ, తన అభిప్రాయం అతనికి చెప్పకపోవడం. అతన్ని చాలా కాలం భ్రమల్లో వుంచుతూ కాలం గడపడం. ఆమె మీద విమర్శ వుంటే ఆ తప్పుకే వుండాలి. అంతేగానీ, పురుషుడితో సంబంధాన్ని ఇష్టపడకపోవడం ఆమె నేరం కాదు. అది తనకు ఇష్టం లేదని ఆమె చెప్పేసింది కాబట్టి, దాన్ని బట్టి అతను తన మార్గం తను ఏర్పర్చుకోవాలి. ఆమెని ఇబ్బంది పెట్టకుండా ఆమెతో కలిసి వుండడం ఇష్టమైతే వుండాలి. లేకపోతే విడిపోవాలి. ఆ సంబంధం ఆమెకి ఇష్టం లేకపోతే ఆమెకి శిక్ష వెయ్యవలసిన అవసరం ఎవరికీ వుండదు. ఇద్దరూ విడిపోతే, అది ఇద్దరికీ మంచిదే. అది ఎవరికీ శిక్ష అవదు. ముగింపు ఆ పద్ధతిలోనే వుండాలి. ఎవరి మార్గంలో వాళ్ళు జీవిస్తారు. గతంలో ఈ అర్థం స్పష్టంగా లేదు. అదే ఇప్పుడు చేశాను.

28-6-2004